


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

- రెండు రోజులు హస్తినలోనే
- ఎన్డీఏ, నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొననున్న సీఎం

- వివరాలు 2 లో..

# అండగా నిలబడతాం

### స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి లోకేష్ హామీ



- పరిహారం ప్రకటించి చేతులు దులిపేసుకోం
- మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం
- స్టీల్ ప్లాంట్ ప్రాసెస్‌లో ఎక్కడా లోపం లేదు
- ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత చర్యలు
- విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వానిది
- విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ స్పష్టీకరణ

3







# ప్రాజెక్టులతో ఆర్థిక పరుగులు

- ఆర్థిక వృద్ధి విశ్లేషణకు నెలవారీ నివేదికలు
- జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకునేలా సామర్థ్యాల పెంపు
- ఏఐతో పన్నులు, రెవెన్యూ వసూళ్లపై దృష్టి
- జీఎస్డీపీ లక్ష్యాలు, కేపీఐపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



2




8

**విశాఖ మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల పరిహారం**

- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

## ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలకు ప్రత్యేక యాప్



- రూరల్ అన్న క్యాంటీన్లనూ సమర్థవంతంగా నిర్వహించాలి
- ప్రతిరోజూ తాగునీటి శాంపిల్లు తీయాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



విశాఖ ఉక్కు మృతుల కుటుంబాలకు

## రూ.25 లక్షల పరిహారం

కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డి కుమారస్వామి వెల్లడి

క్షతగాత్రులకు ఆస్పత్రిలో పరామర్శ

6


# ఏపీ ఈజ్ బ్యాక్!

## 'నాయుడు గిరీ'పై దేశవ్యాప్త చర్చ

- రాష్ట్రానికి వరదలా పెట్టుబడులు
- రెండేళ్లలో పెట్టుబడులకు 800 కంపెనీల ఆసక్తి
- ప్రాసెస్‌లోకి వచ్చిన 68 శాతం ఎంఓయూలు
- పెట్టుబడుల సాకారానికి నిత్యం కేంద్రంతో సంప్రదింపులు
- ఎంఓయూల అమలుకు ప్రత్యేక నోడల్ అధికారులు... జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక బాధ్యతలు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో మారుతోన్న ఏపీ ముఖ చిత్రం
- ఎంఓయూల అమలుపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ

5

*ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. రెండేళ్లల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానంలో తన స్టైల్ మార్చారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచాయి. ప్రస్తుతం రెండేళ్ల కాలంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనబరిస్తే.. వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. వీటిల్లో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ ఎంఓయూల ద్వారానే వస్తున్నాయి. వీటి ద్వారా 21.20 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.*



చైతన్యరథం

# ప్రాజెక్టులతో 'ఆర్థిక' పరుగులు

- ఆర్థిక వృద్ధి విశ్లేషణకు నెలవారీ నివేదికలు
- జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకునేలా సామర్థ్యాల పెంపు
- ఏఐతో పన్నులు, రెవెన్యూ వసూళ్లపై దృష్టి
- జీఎస్డీపీ లక్ష్యాలు, కేపీఐపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర స్థూల ఉత్పత్తి, రాష్ట్రంలోని ఆర్థిక వృద్ధిని విశ్లేషించేందుకు నెల వారీ నివేదికల్ని రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర- క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా నిర్దేశిత తేదీకి ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు.నెల, త్రైమాసికం, అర్ధ సంవత్సరంలో నమోదయ్యే వివిధ గణాంకాల ద్వారా ఎప్పటికప్పుడు జీఎస్డీపీ లక్ష్యాన్ని సమీక్షించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్రస్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల(కేపీఐ)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను సాధించే అంశంపై సీఎం దిశానిర్దేశం చేశారు. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతోపాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలుచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై చేసే వ్యయంపై 3.5రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని, రియల్ టైమ్‌లో ఈ ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఓ ఏఐ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్సుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్‌ను పెంచేందుకు శ్రద్ధపెట్టాలని స్పష్టం చేశారు. తయారీ, గనులు,వాణిజ్యం,రవాణా, తదితర, రంగాలతోపాటు అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టులతో ఆర్థిక వ్యవస్థకు మల్టిప్లైయర్ ఎఫెక్ట్ వచ్చేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. అధికారులు, ఉద్యోగుల సామర్థ్యాల పెంపుపై జూలై 2-3 తేదీల్లో రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించాలని సీఎం సూచించారు. జీఎస్టీ సహా పన్ను వసూళ్లపై పూర్తి సాంకేతికతను వినియోగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్,ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటకశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలకు ప్రత్యేక యాప్

- రూరల్ అన్న క్యాంటీన్లనూ సమర్థవంతంగా నిర్వహించాలి
- ప్రతిరోజూ తాగునీటి శాంపిళ్లు తీయాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్ లైన్‌లో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని.. దీంతో పాటు ప్రత్యేకంగా ఓ యాప్ రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...ప్రభుత్వం అందించే అన్ని సేవలను ఆన్ లైన్ చేశాం.. మన మిత్ర వాట్సాప్ ద్వారా ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇదే సందర్భంలో ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా యాప్ రూపొందించాలి. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలి. అర్బన్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల సేవలను ఏ విధంగా అందిస్తున్నారో... రూరల్ ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లల్లోనూ అదే స్థాయిలో సేవలు అందించాలి. ప్రజలకు అందే తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి కాలుష్యం అనేది ఉండకూడదు. తాగునీటిలో ఎలాంటి మలినాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ తాగునీటి శాంపిళ్లు తీయాలి. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపొద్దు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజల్లో అవగాహన వస్తేనే క్లీన్ అండ్ గ్రీన్ తరహా కార్యక్రమాలను విజయవంతం చేయగలం. ప్రకృతి పట్ల, పరిసరాల శుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



### రాష్ట్ర వ్యాప్తంగా జలధార

జలధార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమం ఫలితాలు కన్పించాలి. చెరువులను సిద్ధంచేసుకోవాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నిండేలా చూడాలి. వర్షపు నీటిని ఒడిసి పట్టాలి. ప్రతి కుంటనూ, ప్రతి చెరువునూ ఆన్ లైన్లో పెట్టేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించుకునేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దీని కోసం టెక్నాలజీని వినియోగించాలి. ఈ మేరకు అనంతపురం జిల్లాలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును పరిశీలించాలి. గంజాయిని అరికట్టేందుకు మూలాల్లోకి వెళ్లాలి. గంజాయి సాగు, రవాణా, అమ్మకం, వినియోగం అనేది ఎక్కడా కన్పించకూడదు. మహిళలపై నేరాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలి... వివిధ నేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడతాయి... శిక్షలు పడిన వారికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలి. మహిళలపై నేరాలు చేయాలంటే భయపడేలా ప్రచారం చేపట్టాలి. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. పరిపాలనలో నూతన విధానాల అమలుపై కేంద్రం ఆసక్తి చూపిస్తోంది. సుపరిపాలన లో భాగంగా రాష్ట్రంలో కొత్త విధానాలను ప్రవేశపెట్టాం. అధికారులు, ఉద్యోగులకు పనితీరును మెరుగు పరిచేలా ఓరియేంటేషన్ ఇస్తున్నాం. టెక్నాలజీని వినియోగించుకుని పరిపాలనలో కొత్త పద్దతులను అమలు చేస్తున్నాం. టెక్నాలజీ డ్రివెన్ నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఆర్టీజీఎస్, అవేర్ వంటి వ్యవస్థలతో పరిపాలనలో కొత్త విధానాలను ఎస్టాబ్లిష్ చేస్తున్నాం. కేంద్రం ఈ తరహా పద్దతులను అమలు చేసేందుకు ఆసక్తిగా ఉంది. వీటిని ఢిల్లీలో జరగబోయే నీతి ఆయోగ్ సమావేశంలో ప్రజెంట్ చేద్దాం అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్షలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

- రెండు రోజులు హస్తినలోనే
- ఎన్డీఏ, నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొననున్న సీఎం

అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనకు ఢిల్లీ వెళుతున్నారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. 11వ తేదీ గురువారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.

చైతన్యరథం

# అండగా నిలబడతాం

## స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి లోకేష్ హామీ

- పరిహారం ప్రకటించి చేతులు దులిపేసుకోం
- మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం
- స్టీల్ ప్లాంట్ ప్రాసెస్‌లో ఎక్కడా లోపం లేదు
- ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత చర్యలు
- విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వానిది
- విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ స్పష్టీకరణ



విశాఖపట్నం (చైతన్యరథం): స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు శాశ్వతంగా అండగా నిలబడతామని, పరిహారం ప్రకటించి చేతులు దులిపేసుకోబోమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. విశాఖలో స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం మీడియాతో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రూ.15వేల కోట్ల ప్యాకేజీతో విశాఖ ఉక్కును కాపాడుకుని, తిరిగి ఉత్పత్తి కూడా ప్రారంభించామని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాదం చాలా బాధాకరం అన్నారు. అత్యుత్తమ టెక్నాలజీ ఉన్న ప్లాంట్ ఇది. ప్రమాదం జరిగిన వెంటనే కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, రాష్ట్ర హోంమంత్రి, స్థానిక ఎంపీ శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వచ్చారు. అదేరోజు రాత్రి కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్వయంగా వచ్చి పరిస్థితులను సమీక్షించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా వచ్చారు. స్టీల్‌ప్లాంట్ పట్ల, కార్మికులు, సిబ్బంది పట్ల ఎన్డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### ముందుగా రూ.25 లక్షల పరిహారం

నేను కేవలం చెక్ ఇవ్వడానికి రాలేదు. బాధిత కుటుంబాలకు శాశ్వతంగా అండగా నిలబడేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ముందడుగు వేసింది. పర్మినెంట్ అయినా, కాంట్రాక్ట్ అయినా మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి పెద్దమనసుతో హామీఇచ్చారు. గతంలో ఈవిధంగా ఎక్కడా జరగలేదు. అవసరమైతే దీనిని కేంద్ర కేబినెట్ ముందుకు కూడా తీసుకెళ్తానని, తనదీ బాధ్యత అని కేంద్రమంత్రి కచ్చితంగా చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడాల్సిన బాధ్యత మాపై ఉంది. స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం కొంతమందికి ఎక్కువ ఎక్స్ గ్రేషియా అందుతుంది.

ఎంతుంటే అంత ఇవ్వాలి. ఇప్పటికే సీఎండీ చాలా స్పష్టంగా చెప్పారు.కేంద్రమంత్రి కుమారస్వామి ఇచ్చిన ఆదేశాల మేరకు 8మంది మృతుల కుటుంబాలకు మొదటి విడత కింద వెంటనే రూ.25 లక్షలు పరిహారం అందజేస్తాం. దాని తర్వాత రావాల్సిన ఎక్స్ గ్రేషియా, పీఎఫ్ నగదు, స్టీల్ ప్లాంట్ నుంచి రావాల్సింది కూడా మొత్తం లెక్కించి, ఆయా కుటుంబాల ఖాతాల్లో జమచేయించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. మృతుల అంత్యక్రియల అనంతరం అందరం మరోసారి చర్చించి ఏం చేయాలో ఆలోచిస్తాం. బాధిత కుటుంబాల పిల్లలు సొంత కాళ్లపై నిలబడేలా చేయాల్సిన బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వంపై ఉందని మంత్రి లోకేష్ అన్నారు.

### కమిటీ నివేదిక తర్వాత చర్యలు

గతంలో విశాఖ ఉక్కును ఎన్డీఏ ప్రభుత్వం ఏవిధంగా కలిసికట్టుగా కాపాడిందో అదేవిధంగా కార్మికుల కుటుంబాలకు మేం అండగా నిలబడతాం. ప్రమాదంపై ఇప్పటికే కమిటీని నియమించారు. ఉక్కు ద్రవం పొంగడం కాకుండా పైనుంచి చిమ్మడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. దీనిపై క్షుణ్ణంగా పరిశీలన జరుగుతుంది. కమిటీ నివేదిక తర్వాత ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ రోజు క్షతగాత్రుల్లో ఒకరైన శ్రీనివాసరావును కలిశాను. ఆ పరిస్థితుల్లో కూడా విశాఖ ఉక్కును కాపాడాలని ఆయన కోరుకోవటం చూసి తాను ఎంతగానో చలించిపోయానని మంత్రి లోకేష్ తెలిపారు.

### ప్రాసెస్‌లో ఎక్కడా లోపం లేదు

స్టీల్ ప్లాంట్‌లో తక్కువ మంది కార్మికులు ఉండటం ఈ ప్రమాదానికి కారణం కాదు. ప్రాసెసింగ్‌లో ఎలాంటి పొరపాటు, తేడాలు లేవు.లాడిల్ భారీ శబ్దంతో ఒక్కసారి పేలిపోయి, ఉక్కుద్రవం బయటకు చిమ్మింది. ఇది ఎందుకు జరిగిందో తెలియదు. స్టీల్ ప్లాంట్‌లో అత్యుత్తమమైన రష్యన్ టెక్నాలజీనే వినియోగిస్తున్నారు. కమిటీ నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### స్లర్రీ పైప్ లైన్ తీసుకువస్తాం

విశాఖ ఉక్కుకు కూడా స్లర్రీ పైప్ లైన్ వేయాలి. దీనిపై ఏనాడూ, ఏ కార్మిక సంఘం నాయకులు మాట్లాడలేదు. విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ తీసుకువచ్చే బాధ్యత మా ప్రభుత్వానిది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. కార్మికులను చూసుకునే బాధ్యత నాది. పరిహారం అందించి చేతులు దులుపుకుని పోవాలని కార్మిక నేతలు మాట్లాడుతున్నారు. ఇది సరికాదు. ప్రభుత్వం తెచ్చిన పునరుద్ధరణ ప్యాకేజీ వల్లే ప్లాంట్ నడుస్తోందని, ఆ ప్యాకేజీ తేకుండా ఉంటే ప్లాంట్ మూతపడి ఉండేదని, ఈ ప్రమాదం జరిగి ఇంతమంది చనిపోయేవారు కాదు కదా అంటూ కొందరు మాట్లాడటం అత్యంత దురదృష్టకరం. ప్లాంట్ నిలబడాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంటే, జరిగిన దుర్ఘటనను పట్టుకుని ఇలా విమర్శించడం ఎంతవరకు సమంజసం? ప్రజలు కూడా ఆలోచించాలి. ఎక్స్ గ్రేషియా ఇస్తాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. వారు అడిగిన ఎక్స్ గ్రేషియా కంటే రెగ్యులర్ ఉద్యోగులకు ఇంకా ఎక్కువ వస్తుందని మంత్రి లోకేష్ తెలిపారు.

### మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం

పర్మినెంట్ అయినా, కాంట్రాక్ట్ అయినా మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తాం.ఇదీ ఎన్డీయే చిత్తశుద్ధికి నిదర్శనం.గతంలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు కూడా మేం వచ్చిన తర్వాత న్యాయం చేశామని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

అంతకుముందు విశాఖ కేజీహెచ్‌కు వచ్చిన మంత్రి నారా లోకేష్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం సెవెన్ హిల్స్, కిమ్స్ ఆసుపత్రిలో స్టీల్ ప్లాంట్ ప్రమాద క్షతగాత్రులను,వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.వారికి ధైర్యం చెప్పారు. అనంతరం స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. కార్మికులతో మాట్లాడి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మంత్రి లోకేష్‌తోపాటు కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత,మంత్రి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చింతకాయల విజయ్ బాధితులను పరామర్శించారు.




## స్టీల్‌ప్లాంట్ ప్రమాద స్థలంలో మంత్రి లోకేష్ పరిశీలన



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. ఉక్కు కర్మాగారంలో స్టీల్ మెల్ట్ షాప్(ఎస్ఎంఎస్)-1 ప్రాంతంలో ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ప్రమాద కారణాలను స్టీల్ ప్లాంట్ యాజమాన్యం వివరించింది. సిబ్బంది నుండి మంత్రి లోకేష్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.







# స్టీల్‌ప్లాంట్ ప్రమాదం.. మృతుల కుటుంబాలకు మంత్రి లోకేష్ ఓదార్పు









విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబసభ్యులను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించేందుకు మంత్రి లోకేష్ మంగళవారం విశాఖ వచ్చారు. తొలుత కేజీహెచ్‌కు చేరుకుని స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు.

మంత్రి నారా లోకేష్ వెంట కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి సంధ్యారాణి, ఎంపీ శ్రీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు చింతకాయల విజయ్ ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు గురించి మంత్రి లోకేష్ అడిగి తెలుసు కున్నారు. ధైర్యంగా ఉండాలని మృతుల కుటుంబ సభ్యులను మంత్రి లోకేష్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడేందుకే తాను వచ్చానన్నారు. బాధితులను పరామర్శించి, తోడుగా ఉంటామని చెప్పేందుకు  కేంద్ర మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు వచ్చారన్నారు. బాధిత కుటుంబాలకు జీవితాంతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందరం కలిసి పోరాడటం వల్లే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామన్నారు. ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.







# స్టీల్‌ప్లాంట్ ప్రమాదం.. క్షతగాత్రులకు మంత్రి లోకేష్ పరామర్శ

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న సూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావులను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి మంత్రి లోకేష్ పరామర్శించారు.

గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి మంత్రి లోకేష్ తెలుసుకున్నారు. అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

అనంతరం విశాఖ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆర్.మల్లికార్జునరావు, గుడివాడ అర్జున అప్పారావు, బి.సత్యానందలను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. మంత్రి లోకేష్ వెంట కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను మంత్రి లోకేష్ ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.




# ఏపీ ఈజ్ బ్యాక్!

## 'నాయుడు గిరీ'పై దేశవ్యాప్త చర్చ

- రాష్ట్రానికి వరదలా పెట్టుబడులు
- రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో పెట్టుబడులకు 800 కంపెనీల ఆసక్తి
- చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎంఓయూల ఛేజింగ్
- ప్రాసెస్‌లోకి వచ్చిన 68 శాతం ఎంఓయూలు
- పెట్టుబడుల సాకారానికి నిత్యం కేంద్రంతో సంప్రదింపులు
- ఎంఓయూల అమలుకు ప్రత్యేక నోడల్ అధికారులు... జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక బాధ్యతలు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో మారుతోన్న ఏపీ ముఖ చిత్రం
- ఎంఓయూల అమలుపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. రెండేళ్లల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానంలో తన స్టైల్ మార్చారు. గతానికి భిన్నంగా వెళ్లడం మొదలు పెట్టారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అవలంభించింది. ఆ స్పీడుతోనే నాడు కొన్ని కీలక పెట్టుబడులు తెచ్చింది. కియా కార్ల కంపెనీని తెచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా.. ప్రత్యేకించి పెనుకొండ ప్రాంతం రూపు రేఖలు మార్చింది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. దీంట్లో భాగంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి.. భారీ స్థాయిలో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచాయి. ప్రస్తుతం రెండేళ్ల కాలంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనబరిస్తే.. వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. వీటిల్లో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ ఎంఓయూల ద్వారానే వస్తున్నాయి. 2025 ఏడాదిలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలతో పాటు... వివిధ వేదికల మీద.. వివిధ సందర్భాల్లో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ కలిపి మొత్తంగా రూ. 21.64 లక్షల కోట్లుగా ఉంటే.. వీటి ద్వారా 21.20 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.

### రికార్డు స్థాయిలో పెట్టుబడులు... పర్ఫెక్ట్ మానిటరింగ్

"ఆంధ్రప్రదేశ్ ఈజ్ బ్యాక్" అనే నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం వైపు చూడటానికే భయపడి, పెట్టుబడులు వెనక్కి తీసుకుని పారిపోయిన కంపెనీలు... నేడు ఏపీ వైపు క్యూ కడుతున్నాయి. ఎంఓయూలు కుదుర్చుకోవడం.. ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేయడమనేది గతంలో జరిగిన వ్యవహారం. ఆ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంఓయూల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కుదుర్చుకున్న ఎంఓయూలను నిరంతరం మానిటర్ చేసేందుకు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా... కుదిరిన ప్రతి ఒప్పందాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, కంపెనీలు క్షేత్రస్థాయిలోకి వచ్చేలా ప్రభుత్వం చేస్తున్న 'ఛేజింగ్' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అంటే ఏమిటో దేశానికి కళ్లకు కట్టినట్టు ఏపీ చూపిస్తోంది. ఫలితంగానే దేశానికి వచ్చిన ఎఫ్‌డీఐల్లో 25.3 శాతం ఎఫ్‌డీఐలు ఏపీకి వచ్చాయి. పెట్టుబడుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అధికారులకు ప్రత్యేకంగా అప్పగించింది. కేవలం అధికారులుగా కుర్చీలకే పరిమితం కాకుండా... ప్రభుత్వం తరపున మార్కెటింగ్ మేనేజర్లుగా మారి పారిశ్రామికవేత్తల వెంట పడాలి.. వారి సమస్యలను పరిష్కరించి పరిశ్రమలు స్థాపించేలా చూడాలని సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులకు నిర్దేశిస్తూ ఉంటారు. ఎంఓయూల అమలుకు మూడు రీజియన్లకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించారు. ఎంఓయూల విషయంలో దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా నిరంతరం ఛేజింగ్ చేస్తుండడం వల్లే వల్లే అతి తక్కువ కాలంలోనే కంపెనీలు సాకారమవుతున్నాయి.


### 36 రోజుల్లోనే 'ఆమ్కా'.. గూగుల్ కోసం నిబంధనల మార్పు

పెట్టుబడులు, పరిశ్రమలను గ్రౌండ్ చేసే విషయంలో ప్రభుత్వ వేగానికి, పట్టుదలకు ఆమ్కా (రూవీజూా) ప్రాజెక్టే నిలువెత్తు నిదర్శనం. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో అడుగుపెట్టి పనులు ప్రారంభించింది. ఆమ్కా విషయంలోనే కాదు.. ఇదే వేగంతో... కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా దిగ్గజ సంస్థలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి. ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం కోసం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చర్చించి.. అవసరమైన మేరకు నిబంధనల్లోనే కీలక మార్పులు చేసేందుకు అంగీకరించేలా కేంద్రాన్ని ఒప్పించారు. అలాగే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా స్లర్రీ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని సీఎం చంద్రబాబు ఒప్పించగలిగారు. ఈ విధంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. తద్వారా ఏపీకి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు.. కంపెనీలు ఎస్టాబ్లిష్ చేసేందుకు మార్గాన్ని కల్పిస్తోంది. ఏపీకి పొరుగునున్న రాష్ట్రాలను కాదని ఏపీకి కంపెనీలు క్యూ కట్టడం ఆయా రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో పెట్టుబడుల విషయంలో నాయుడు గిరీ అంటూ జాతీయ పత్రికల్లో వచ్చిన కథనాలు ఆయా రాష్ట్రాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ తమిళనాడును కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో తమిళనాడులో జరిగిన చర్చే దీనికి నిదర్శనం.

### ఎంఓయూల సాకారమిలా...

గతంలో లక్షల కోట్ల ఎంఓయూలు అంటూ ప్రచారం జరిగి.. క్షేత్రస్థాయిలో రూపాయి పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ. 21.64 లక్షల కోట్ల మొత్తం ప్రతిపాదిత పెట్టుబడుల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఇప్పటికే ప్రాసెస్ లోకి వచ్చిన ఎంఓయూలు 68.02 శాతంగా ఉన్నాయి... డీపీఆర్ సబ్మిషన్ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ఎంఓయూలు 60.44 శాతంగా ఉంటే... భూ కేటాయింపులు దశను పూర్తి చేసుకున్న ఎంఓయూలు 21.39 శాతంగా ఉన్నాయి. మొత్తం పెట్టుబడుల్లో అతి తక్కువ కాలంలో 68 శాతానికి పైగా పెట్టుబడులు ఇప్పటికే ప్రాసెస్ లోకి రావటం కీలక పరిణామంగా చెప్పవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీలు రూపొందిస్తూ ముందుకు వెళ్తుండడంతో ఏపీపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పెరిగింది. అధికారుల్లో జవాబుదారీతనం కూడా పెరగడంతో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల్లో "ఏపీ ఈజ్ బ్యాక్" అనే చర్చ ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు లక్షలాది ఉద్యోగాలు రావడం ఖాయమనే అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది.





చైతన్యరథం

### విశాఖ ఉక్కు ప్లాంట్ విషాదం:

# మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం

### కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డి కుమారస్వామి వెల్లడి

విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. ఆరుగురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం రాత్రి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలిపిన మంత్రి కుమారస్వామి, మృతుల వారసులకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రకటించారు. అంతేగాక, బాధిత కుటుంబాలు ప్లాంట్ క్వార్టర్లలో నివసించడానికి



అనుమతి, వారి పిల్లలకు ఉచిత విద్య, ప్రతి కుటుంబంలో ఒక్కొక్కరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.

కాస్టింగ్ ఆపరేషన్ సమయంలో స్లైడ్ గేట్ తెరవడానికి ముందే తీవ్రమైన పేలుడు సంభవించి, కరిగిన ఉక్కు తుండిష్‌లోకి పోయే సమయంలో అగ్నిగోళం పైకప్పు వరకు ఎగిసిపడిందని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రమాద కారణాలను నిర్ధారించేందుకు ఇతర స్టీల్ ప్లాంట్ నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ కమిటీ స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, విశాఖ జిల్లా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేసి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

# జయహో బాలయ్య...!



ఆయన సినిమా విడుదల అవుతుందంటే చాలు సినిమా థియేటర్ల వద్ద పండగ వాతావరణం నెలకొంటుంది. అర్ధరాత్రి నుంచే థియేటర్లు హోరెత్తి పోతుంటాయి. ఆరేళ్ల పసి పిల్లాడి నుంచి 60 ఏళ్ల ముసలి తాత వరకు ఒకటే నినాదం... ఆ ఉత్సాహం పేరే జై బాలయ్య. జూన్ 10 అంటే తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేకమైన రోజు. వెండితెరపై సింహంలా గర్జించిన హీరో పుట్టినరోజు. కోట్లాది అభిమానుల గుండెల్లో "బాలయ్య"గా నిలిచిన నటసింహాని జన్మదినం. నందమూరి బాలకృష్ణ అంటే కేవలం ఒక సినీ హీరో కాదు. అతను ఒక వారసత్వం... ఒక క్రమశిక్షణ... ఒక అంకితభావం...ఒక స్ఫూర్తి. నేటి సోషల్ మీడియా తరం విజయాన్ని కేవలం ఫలితాల్లో చూస్తుంది. కానీ బాలకృష్ణ జీవితం చూస్తే విజయం వెనుక ఎంత కష్టం, సహనం, అంకిత భావం ఉంటాయో అర్థమవుతుంది.

#### తనకంటూ ప్రత్యేక గుర్తింపు

ఎన్టీఆర్ లాంటి మహానటుడి కుమారుడిగా జన్మించడం ఒక అదృష్టమే. కానీ అదే సమయంలో అది ఒక పెద్ద సవాలు కూడా. ఎందుకంటే ప్రతి అడుగులో పోలికలు ఉంటాయి. ప్రతి సినిమాలో అంచనాలు ఉంటాయి. ప్రతి విజయాన్ని వారసత్వం అంటారు. ప్రతి అపజయాన్ని వ్యక్తిగతంగా చూపిస్తారు. అలాంటి పరిస్థితుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించడం అంత సులభం కాదు. 1974లో "తాతమ్మకల"తో బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన బాలకృష్ణ, నేడు 50 సంవత్సరాలకు పైగా తెలుగు సినీ పరిశ్రమలో తన ప్రత్యేక ముద్ర వేసి నిలిచారు. ఇది సాధారణ విషయం కాదు. ఒక తరం కాదు... రెండు తరాలు కాదు...మూడు తరాల ప్రేక్షకులను అలరించిన అరుదైన నటుడు మన బాలయ్య.

#### పాత్ర ఏదైనా... పరకాయ ప్రవేశం

పౌరాణిక పాత్రలు చేయాలంటే ఎన్టీఆర్ తర్వాత బాలకృష్ణ అనే పేరు వినిపిస్తుంది. జానపద కథలు అంటే బాలయ్య గుర్తుకొస్తారు. చారిత్రక పాత్రలు అంటే బాలయ్యనే గుర్తు చేస్తాయి. సామాజిక చిత్రాల్లో మాస్ హీరోగా గర్జించడమూ ఆయనకే సాధ్యం. "ఆదిత్య 369"లో సైన్స్ ఫిక్షన్ హీరోగా కనిపించినా..."భైరవద్వీపం"లో జానపద వీరుడిగా మెప్పించినా..."సమరసింహారెడ్డి", "నరసింహనాయుడు", "సింహా", "లెజెండ్", "అఖండ", "భగవంత్ కేసరి" వంటి చిత్రాల్లో మాస్ ఐకాన్‌గా నిలిచినా...ప్రతి పాత్రలో పూర్తి నిబద్ధత కనిపిస్తుంది. ఇదే ఆయన ప్రత్యేకత.

#### జయాపజయాలను సమానంగా స్వీకరిస్తూ...

ఇది యువత తప్పక నేర్చుకోవాల్సిన విషయం. బాలకృష్ణ కెరీర్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్లు ఉన్నాయి. అలాగే కొన్ని పరాజయాలు కూడా ఉన్నాయి. కానీ ఆయన ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఒక సినిమా ఫ్లాప్ అయితే మరో సినిమా కోసం రెట్టింపు శ్రమించారు. ఒక అడ్డంకి ఎదురైతే మరో అవకాశాన్ని సృష్టించుకున్నారు. జీవితంలో విజయానికి ఇదే అసలైన నిర్వచనం. పడిపోకుండా ఉండటం గొప్ప కాదు. పడిపోయినా మళ్లీ లేవడం. అదే బాలకృష్ణ జీవితం చెబుతున్న పాఠం.

#### సినిమాలకు అతీతంగా సామాజిక సేవ

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచిన ఆ సంస్థ వెనుక బాలకృష్ణ గారి కృషి ఎంతో ఉంది. సినిమాల్లో హీరోగా కనిపించడం ఒక విషయం. కానీ నిజ జీవితంలో ప్రాణాలు కాపాడే సేవ చేయడం మరో విషయం. అందుకే ఆయనకు వచ్చిన గౌరవం కేవలం నటుడిగా వచ్చినది కాదు. మానవతా వాదిగా సంపాదించుకున్న గౌరవం కూడా.

#### పద్మభూషణ్ -- ప్రజల ప్రేమకు వచ్చిన గుర్తింపు

2025లో భారత ప్రభుత్వం బాలకృష్ణ గారిని పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఇది ఒక వ్యక్తికి వచ్చిన అవార్డు మాత్రమే కాదు. తెలుగు సినిమా గౌరవానికి వచ్చిన గుర్తింపు.

దశాబ్దాల పాటు నటుడిగా, సేవకుడిగా చేసిన ప్రయాణానికి దేశం ఇచ్చిన గౌరవం. అలాగే 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గుర్తింపుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో చోటు దక్కడం కూడా అరుదైన ఘనత.

#### హిందూపురం ప్రజల ఆత్మబంధువుగా...

హిందూపురం ప్రజలు బాలకృష్ణను కేవలం హీరోగా చూడలేదు. తమ ఇంటి మనిషిలా భావించి ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, 2019, 2024లోనూ వరుసగా విజయఢంకా మోగించి హ్యాట్రిక్ సాధించారు. ఒక నటుడికి అభిమానులు ఉండొచ్చు. కానీ వరుసగా ప్రజలు ఓటు వేసి గెలిపించడం అంటే విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టు కోవడం ఇంకా గొప్ప విషయం.

#### అన్‌స్టాపబుల్ -- బాలయ్య

కాలంతో పాటు మారడం అందరికీ సాధ్యం కాదు. కానీ బాలకృష్ణ అది చేసి చూపించారు. "అన్ స్టాపబుల్" కార్యక్రమం ద్వారా కొత్త తరానికి మరింత చేరువయ్యారు. ఇప్పటి యువత చూసే డిజిటల్ ప్రపంచంలో కూడా తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. అదే నాయకత్వ లక్షణం. కాలం మారినా తన ప్రభావాన్ని నిలబెట్టుకోవడం.

బాలయ్య నుంచి నేటి యువత నేర్చుకోవాల్సినవి 5 అంశాలు ఉన్నాయి. మొదటిది -- కష్టపడటం. రెండోది -- క్రమశిక్షణ. మూడోది -- అపజయాలకు భయపడక పోవడం. నాలుగోది -- కుటుంబ వారసత్వం ఉన్నా తనకంటూ గుర్తింపు సంపాదించడం. ఐదోది -- విజయంతో పాటు సమాజానికి సేవ చేయడం. ఈ ఐదు విలువలే బాలకృష్ణ జీవిత సారాంశం.

#### ఎవర్ గ్రీన్ బాలయ్య

కొంతమంది నటులు వస్తారు... వెళ్తారు.కొంతమంది హీరోలు హిట్లు ఇస్తారు... తర్వాత ఫేడ్ అవుట్ అయిపోతారు. కానీ కొందరు వ్యక్తులు ఒక తరానికి గుర్తుగా నిలుస్తారు. అలాంటి ఎవర్ గ్రీన్ హీరో నందమూరి బాలకృష్ణ. అతని గర్జన కేవలం సినిమా డైలాగుల్లో కాదు... అతని ప్రయాణం కేవలం వెండితెరపై కాదు... అతని ప్రభావం కేవలం అభిమానుల వరకే కాదు... ఒక వ్యక్తి కష్టపడి, క్రమశిక్షణతో, అంకితభావంతో ఎలా శిఖరాలను అధిరోహించగలడో చెప్పే సజీవ ఉదాహరణ. ఈ పుట్టినరోజు సందర్భంగా ఒక మాట చెప్పాలి... "బాలయ్య అంటే కేవలం ఒక పేరు కాదు... ఒక శక్తి. ఒక స్ఫూర్తి. ఒక తరం గర్వించే వ్యక్తిత్వం." హ్యాపీ బర్త్‌డే బాలయ్య బాబు! మీ ప్రయాణం మరెన్నో తరాలకు స్ఫూర్తిగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ...




శశి కుమార్,
తెలుగుదేశం సైనికుడు

## వర్జీనియా పొగాకు రైతులు, కంపెనీల

# సమన్వయంతోనే మార్కెట్‌కు స్థిరత్వం

- కొనుగోలు వేగవంతం చేసేందుకు సీఎం ప్రత్యేక చొరవ
- కేంద్ర ప్రభుత్వంతో విస్తృత చర్చలు
- ఎగుమతిదారులకు వడ్డీ రాయితీపై కేంద్రం సానుకూల స్పందన
- రోజువారీ కొనుగోలు 150 బేళ్లనుంచి 700 బేళ్లకు పెరుగుదల
- రైతులు అన్ని గ్రేడ్ల పొగాకును ఒకేసారి మార్కెట్‌కు తీసుకురావాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన



అమరావతి (చైతన్య రథం): వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో నిరంతర సంప్రదింపుల వలన పొగాకు బోర్డు ఈడీ, చైర్మన్‌లకు కేంద్ర ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయడంతో పొగాకు మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల పురోగతి, ఎగుమతుల స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం పొగాకు బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో రైతులు, కొనుగోలు సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. రైతులు, కంపెనీల అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతం చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. అదే క్రమంలో పొగాకు బోర్డు చైర్మన్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులను కలుసుకుని వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితిని వివరించినట్లు చెప్పారు.రైతుల సమస్యలపై సానుకూల దృక్పథంతో స్పందించాలని కోరినట్లు వెల్లడించారు.

గత 15 రోజుల క్రితం మార్కెట్‌లో రోజుకు సుమారు 150 బేళ్ల స్థాయిలో మాత్రమే కొనుగోళ్లు జరిగేవని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రైతులు, కంపెనీల మధ్య సమన్వయంతో ప్రస్తుతం ఇది సగటుగా 700 బేళ్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ ధోరణి కొనసాగితే వచ్చే వారం రోజుల్లో రోజుకు 1000 నుంచి 1200 బేళ్ల వరకు కొనుగోళ్లు చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కంపెనీలు అవసరమైన గ్రేడ్ల వివరాలను సమావేశంలో తెలియజేశాయని, వాటి ఆధారంగా వారంవారీ కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. రైతులు అన్ని గ్రేడ్లను సమానంగా మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. అన్ని గ్రేడ్ల సమగ్ర ప్రవాహం ఉంటే కొనుగోళ్లు మరింత సాఫీగా జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అయ్యే పొగాకులో 30 శాతం దేశీయ వినియోగానికి వెళ్లగా, 70 శాతం ఎగుమతులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, రవాణా సమస్యలు, షిప్పింగ్ కంటైనర్ల కొరత వంటి కారణాలతో ఎగుమతి రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కంటైనర్ రవాణా ఖర్చు సుమారు 1,600 డాలర్ల నుంచి 4,000 డాలర్ల వరకు పెరిగినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో జీఎస్టీ భారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని మంత్రి చెప్పారు. అలాగే ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ కల్పించాలన్న ప్రతిపాదనపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య శాఖతో కూడా చర్చలు కొనసాగనున్నాయని తెలిపారు. రైతులు, కంపెనీలు, ఎగుమతిదారులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తేనే ప్రస్తుత సవాళ్లను అధిగమించగలమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మంత్రి ఆనం ఘన స్వాగతం

*నెల్లూరు (చైతన్య రథం): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 10, 11 మరియు 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలీపాడ్‌కు మంగళవారం ఉదయం 11.15 గంటలకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అపూర్వ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అపూర్వ స్వాగతం పలికారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం పలికినవారిలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు నగర మేయర్ సుజాత, విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు ఉన్నారు.*

# భూ కబ్జాలు, దోపిడీలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ స్వీకరణ
- మాజీ మంత్రి అంబటి బంధువు భూకబ్జాపై ఫిర్యాదు
- విజయవాడలో వడ్డీ వ్యాపారి దౌర్జన్యం.. అప్పు సాకుతో కోట్లాది రూపాయల భూమి కబ్జా
- దళిత మహిళ భూమి ఆక్రమణ.. న్యాయం అడిగితే కులం పేరుతో దూషణలు
- గత ప్రభుత్వంలో రీ-సర్వే తెచ్చిన తంటా.. ఆన్‌లైన్‌నుంచి ఐదెకరాలు మాయం
- అర్జీలు స్వీకరించిన మున్సిపల్ మంత్రి నారాయణ, కుడిపూడి సత్తిబాబు

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన పౌరులు భూ కబ్జాలు, వడ్డీ వ్యాపారుల దోపిడీ, రికార్డుల తారుమారు తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**మాజీ మంత్రి బంధువుపై భూ కబ్జా ఆరోపణ**

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మావుల్లపల్లి గ్రామానికి చెందిన సామ్రాజ్యం అర్జీ సమర్పిస్తూ - బాపట్ల జిల్లా చండూరు మండలం వేటపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 322లో తమకు 1.72 ఎకరాల పట్టా భూమి ఉందని, మాజీ మంత్రి అంబటి రాంబాబు బాబాయ్ కొడుకు అంబటి వెంకటేశ్వరరావు ఆ భూమిలో 65 సెంట్లను అక్రమంగా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఆ వ్యక్తిని నిలదీయగా మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడి, చేయి చేసుకుని, ప్రాణహాని కలిగిస్తామని బెదిరించారని పేర్కొన్నారు.

**వడ్డీ వ్యాపారి మోసం..**
**రూ.6.50 లక్షలకు రూ.39 లక్షలు డిమాండ్**

విజయవాడకు చెందిన ఆనంద్ హర్ష అర్జీ సమర్పిస్తూ -కుమార్తె వివాహం నిమిత్తం 2021 జనవరిలో కనుమోలు వాస్తవ్యుడు నూకల పాండు రంగ విఠల్ వద్ద రూ.6,50,000 అప్పు తీసుకున్నారని, అప్పు ఇచ్చే సమయంలో భద్రత పేరిట తమ పొలాన్ని అతని భార్య నవశ్రీ పేరిట విక్రయ దస్తావేజుగా రాయించుకున్నారని తెలిపారు. అసలు, వడ్డీ చెల్లించేందుకు సిద్ధమవ్వగా నిందితుడు రూ.39 లక్షలు కట్టాలని వేధింపులకు గురిచేస్తున్నాడని, పొలాన్ని కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని అన్నారు.



**దళిత మహిళ భూమిపై దాడి.. కులదూషణలు**

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన లక్ష్మీ దేవి అర్జీ సమర్పిస్తూ.. 2.78 ఎకరాల భూమిని తమ మామగారి కాలం నుండి సాగుచేసుకుంటున్నారని, అదే గ్రామానికి చెందిన చెలిమి మీసాల నాగరాజు, చెలిమి మీసాల రమేష్ ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. తమ భూమిని తిరిగి ఇవ్వమని అడిగినందుకు వారు కులం పేరుతో తీవ్రంగా దూషించి, దాడికి ప్రయత్నించారని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్, కలెక్టర్‌కు పలుమార్లు అర్జీలు ఇచ్చినా రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎలాంటి స్పందన చూపలేదని పేర్కొన్నారు.

**రీ-సర్వేతో ఆన్‌లైన్ నుండి 5ఎకరాల భూమి మాయం**

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట మండలం చీరమన గ్రామానికి చెందిన రావిపాటి లక్ష్మీనారాయణ అర్జీ సమర్పిస్తూ.. సర్వే నంబర్ 443-3లో తమకు 5 ఎకరాల పట్టా భూమి ఉందని, 2019 వరకు ఆన్‌లైన్ రికార్డులన్నీ తమ పేరిట స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ-సర్వే తర్వాత అడంగల్, 1-బి రికార్డులు ఆన్‌లైన్ నుండి తొలగించబడ్డాయని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**సాంకేతిక పొరపాటు ఆసరాతో భూకబ్జా యత్నం**

సత్యసాయి జిల్లా అమడుగూరుకు చెందిన వెంకటరమణ అర్జీ సమర్పిస్తూ.. తనకల్లు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1459లో 7.99 ఎకరాల భూమిని 2011లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో జరిగిన సాంకేతిక పొరపాటును ఆసరాగా చేసుకుని ఎ. రమణమ్మ, చింతమనేని నారాయణ తమ పేరిట భూమి నమోదు చేయించుకుని, దొంగ పట్టాదారు పాస్ పుస్తకాలు సంపాదించారని ఆరోపించారు. అక్రమ రికార్డులను రద్దు చేసి న్యాయం చేయాలని విన్నవించారు.

**ఇతర ఫిర్యాదులు**

పల్నాడు జిల్లా గురజాల మండలం తేలుకుట్లకు చెందిన రామకృష్ణారెడ్డి.. సర్వే నంబర్లు 253, 349/1-1-1A4లలో ఉన్న తమ భూమిని ముందస్తు సమాచారం లేకుండా రికార్డుల నుండి తొలగించారని ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా యర్రగుంట్ల మండలం కర్చుకుంటపల్లికి చెందిన డాకాలి లక్ష్మయ్య.. తండ్రి మరణాంతరం భూమిని తన పేరిట మార్పిడి చేయాలని పలుమార్లు రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళినా స్పందన లేదని తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఆంజనేయులు.. రూ.25 లక్షల విలువైన ఆభరణాలు, నగదు దొంగతనమైనా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో కేవలం రూ.2,45,000 మాత్రమే నమోదు చేశారని, దర్యాప్తులో పురోగతి లేదని వేదన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ముడిచర్లకు చెందిన వెంకటేశ్వర్లు.. సర్వే నంబర్ 98/12లో తమ 27 సెంట్ల భూమిని పొరుగు వ్యక్తి బాల లోకేశ్వరరావు తప్పుడు రికార్డులు సృష్టించి తన పేరిట చేయించుకున్నాడని ఆరోపించారు. కడపకు చెందిన రమాదేవి.. అద్దెకున్న వ్యక్తి అక్రమ చికెన్ అంగడి పెట్టి ఇల్లు పాడుచేసి, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతున్నాడని, గంజాయి వ్యాపారం సాగిస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఇంద్రావతి.. సర్వే నంబర్ 127లోని స్థలాన్ని తప్పుడు రిజిస్ట్రేషన్‌లతో ఆక్రమించుకున్నారని, ఎంఆర్ఓ రిజిస్ట్రేషన్ చెల్లదని స్పష్టం చేసినా నిందితులు దొంగ సవరణలు చేయించుకున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం చెంచిరెడ్డిపల్లెకు చెందిన కోటిరెడ్డి.. తమ నాన్నగ కొనుగోలు చేసిన పొలాలను ఆన్‌లైన్ రికార్డుల్లోకి ఎక్కించాలని దాఖలు చేసిన ఫైలు నాలుగు నెలలుగా కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉందని వివరించారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు సమర్పించగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు అందించారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలపై సహాయం అభ్యర్థిస్తూ మరికొందరు విన్నపాలు చేశారు.

## 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఇలాంటి ఘటన జరగలేదు

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం
- కుటుంబంలో ఒకరికి ప్లాంట్‌లో ఉద్యోగం
- క్షతగాత్రులకు రూ.10 లక్షల తక్షణ సాయం
- వైద్య ఖర్చులన్నీ ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుంది
- ప్రమాదంపై త్రిసభ్య కమిటీతో పూర్తిస్థాయి దర్యాప్తు
- నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- కార్మికుల సమస్యలపై త్వరలోనే సమావేశం
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలి సందర్శనవిశాఖపట్నం (చైతన్య రథం): 'విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మరణించడం, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరం. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి కార్మికుని కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున తక్షణ పరిహారంతోపాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్లాంట్లో ఉద్యోగం కల్పిస్తాం. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందిస్తామని, క్షతగాత్రుల వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చులను ప్లాంట్ యాజమాన్యమే పూర్తిగా భరిస్తుందని తెలిపారు. ప్రమాద ఘటనపై బొకారో స్టీల్ ప్లాంట్‌కు చెందిన త్రిసభ్య కమిటీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తుందని, కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం ఉదయం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన, అలాగే తీవ్రంగా గాయపడిన ప్రతి ఒక్క కార్మికుడి కుటుంబానికి కూటమి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తాం. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల చదువులు ప్రస్తుతం ఏవిధంగా సాగుతున్నాయో, మరణించిన కార్మికుల పిల్లల చదువులు కూడా అదేవిధంగా కొనసాగుతాయి. ప్రమాదంలో మరణించిన ఉద్యోగికి పదవీ విరమణ వయస్సు వచ్చేంత వరకు, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఉంటున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే ఉచితంగా కొనసాగవచ్చు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ బయట అద్దె ఇళ్లలో నివసిస్తున్న బాధిత కుటుంబాలు ఒకవేళ ప్లాంట్ క్వార్టర్లలోకి మారాలని అనుకుంటే, వారికి కూడా టౌన్‌షిప్ లోపల క్వార్టర్లను కేటాయిస్తారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రమాద ఘటనపై త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయాలు ఉంటాయి. ఒక కోణంలో కాదు.. అన్ని వైపులా వివరాలు సేకరిస్తే విషయం తెలుస్తుంది. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు బాధపడటం కాదు.. పునరావృతం కాకుండా చూడాలి. అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తుఘటన స్థలంలో కార్మికులతో మాట్లాడాను. సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను ఆధునీకరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, దశాబ్దాల నాటి పాత పరికరాలు, యంత్రాలను మార్చకుండా వాడటం వల్లే ఇలాంటి పెను ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. నాకున్న సమాచారం ప్రకారం గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ కార్యాచరణ చరిత్రలో ద్రవ ఉక్కును మోసుకెళ్లే లాడెల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోయి, ఇంతమంది ప్రాణాలు బలిగొన్న సంఘటన ఎప్పుడూ జరగలేదు. గతంలో చిన్నపాటి లీకేజీలు, ఆక్సిజన్ ప్లాంట్‌లో ఇతర ప్రమాదాలు జరిగినప్పటికీ, ఒక లాడెల్ బకెట్ పేలిపోవడం ఇదే మొదటిసారి అని నిపుణులు చెబుతున్నారు. చైనా, ఫ్రాన్స్‌వంటి విదేశీ ఉక్కు కర్మాగారాల్లో గతంలో కొన్ని పారిశ్రామిక ప్రమాదాలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. కానీ అక్కడ కూడా ఇంత భారీ ఎత్తున మరుగుతున్న ద్రవ ఉక్కు బకెట్ పేలిపోయిన సంఘటనలు నమోదు కాలేదు. ఈ రకమైన పేలుడు అత్యంత అరుదైనది. త్రిసభ్య కమిటీ త్వరలోనే విశాఖపట్నం చేరుకుంటుంది. వారు ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్ విభాగాన్ని స్వయంగా పరిశీలిస్తారు. ద్రవ ఉక్కును తరలించే లాడెల్ బకెట్ యొక్క స్లైడ్ గేట్ తెరవకముందే అసలు పేలుడు ఎందుకు సంభవించింది? ఇది సాంకేతిక లోపమా? ఇంకేదైనా సమస్యా? ఇలా అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. కార్మికుల సమస్యలపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశంస్టీల్ ప్లాంట్లో నెలకొన్న కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకేతికపరమైన ఇబ్బందులను సమగ్రంగా తెలుసుకోవడానికి త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో స్వయంగా ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాను. ప్లాంట్‌లో అసలు ఏం జరుగుతుందో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మిక సంఘాల నేతలతో మాట్లాడతాను. నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడ నిర్లక్ష్యం వహించారు? సేఫ్టీ ప్రోటోకాల్స్ ఎందుకు పాటించలేదు? అనే అంశాలను ఈ సమావేశంలో లోతుగా చర్చిస్తాను. విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాదని, స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలన్నదే తమ ప్రభుత్వ గట్టి ఆకాంక్ష. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగుతుందని, దానికి కావాల్సిన అన్ని రకాల కేంద్ర సహాయ సహకారాలు అందుతాయని తాము బలంగా ఆశిస్తున్నాము. గత వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తే తాము రోడ్లపైకి వచ్చి కొట్లాడాము. విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది ఎంతోమంది త్యాగాల పునాదులపై ఏర్పడింది. ఈ ప్లాంట్ సాధన కోసం జరిగిన ఉద్యమంలో కేవలం ఆంధ్రప్రదేశ్ వారే కాకుండా, తెలంగాణకు చెందిన ముగ్గురు వ్యక్తులు కూడా తమ ప్రాణాలను అర్పించారు. దీనికి ప్రాంతాలకు అతీతమైన చారిత్రక నేపథ్యం ఉంది. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరడానికి, ఆ సమస్యపై కేంద్ర పెద్దలతో మాట్లాడడానికి ఢిల్లీ వెళ్దాం రండి అని తాను పిలుపునిస్తే ఆ రోజు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. కార్మిక సంఘాలు రాజకీయాలకు అతీతంగా పని చేసినప్పుడే కార్మికులకు నిజమైన న్యాయం జరుగుతుంది. విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తులో అద్భుతంగా వర్ధిల్లాలని, మళ్లీ ఎన్నడూ ఇలాంటి ఘోరమైన ప్రమాదాలు జరగకూడదన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, శాసనసభ్యులు పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, విశాఖ డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో బాధితులకు పరామర్శస్టీల్ ప్లాంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన అనంతరం పవన్ కళ్యాణ్ విశాఖపట్నం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు పైడిరాజు, సూరిబాబు, శ్రీనివాస్‌లను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న చికిత్సకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థులు వచ్చేనాటికి..

# హాస్టళ్లను, గురుకులాలను శుభ్రం చేయండి

- బీసీ బిడ్డల ఉన్నత విద్యే కూటమి లక్ష్యం
- రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఆప్కో, లేపాక్షి షోరూమ్‌లలో అమ్మకాలు పెంచండి
- బీసీ సంక్షేమ, చేనేత, జౌళి అధికారులతో సమీక్షలో మంత్రి సవిత



తిరుపతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షోరూమ్‌లలో అమ్మకాలు పెంచాలని, చేనేతలకు, హస్తకళాకారులకు రోజూ ఉపాధి కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్‌లో బీసీ సంక్షేమ, ఆప్కో, లేపాక్షి అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మాట్లాడుతూ, కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో చేరేలోగా, తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్‌రూమ్‌లను శుభ్రం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో చేరే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో అత్యధిక మంది విద్యార్థులను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఐఐటీ, నీట్‌కు ఉచిత శిక్షణ అందజేయనున్నామన్నారు. విశాఖ, టేకులోడు ఎంజేపీ స్కూళ్లలో రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నామని మంత్రి సవిత వెల్లడించారు. ఆరోపణలకు ఆస్కారమివ్వొద్దుగతేడాది బీసీ హాస్టళ్ల వార్డెన్లపై విపరీతమైన ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని నేరమన్నారు. భవిష్యత్తులో బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై ఎటువంటి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాస్టళ్లు, గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వార్డెన్లు, ఎంజేపీ గురుకులాల ప్రిన్సిపాళ్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్షాలు సైతం హాస్టళ్లను, గురుకులాలను సందర్శించి నిర్వహణ బాగోలేదంటూ మీడియాకు లీకేజీ ఇచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. త్వరలో మెస్ చార్జీలు పెంచనున్నామని, బాధ్యతాయుతంగా మెలగాలని వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. అమ్మకాలు పెంచండిఅనంతరం చేనేత, హస్తకళల అధికారులతో మంత్రి సవిత కీలక భేటీ నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఎన్ని ఆప్కో, లేపాక్షి షోరూమ్‌లున్నాయని అడిగి, ఆయా షోరూమ్‌లలో అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేపాక్షి షోరూమ్‌ల నిర్వహణకు 'తరంగ' అనే యాప్ ఆధారిత వ్యవస్థను సిద్ధం చేశామని తెలిపారు.

ఏ నాటి అమ్మకాలను ఆ నాడే నమోదు చేయాలని, ఈనాటి నుంచే చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. మంత్రి సవితతో బీసీ సంఘ నేతల భేటీతిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి సవితను పలువురు బీసీ సంఘ ప్రతినిధులు కలిశారు. బీసీల సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేసి, సత్కరించారు. మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. అందుకు మంత్రి సవిత సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూవో భరత్ రెడ్డి సహా చేనేత, జౌళి శాఖ, లేపాక్షి అధికారులు పాల్గొన్నారు. మంత్రి సవితను కలిసిన వారిలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ఆర్. సదాశివ, ఎస్. త్యాగరాజన్, వి చంద్రశేఖర్ సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పట్టణాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల అభివృద్ధికి ప్రాధాన్యం

- మూడేళ్లలో మౌలిక వసతుల కల్పనకు భారీ ప్రణాళికలు
- డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు రూ.29 వేల కోట్ల ప్రణాళిక
- మున్సిపాలిటీల్లో చేసే పనుల్లో ప్రజాధనం వృధా కాకూడదు
- పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. స్థానిక మురళీ ఫార్ట్యూన్ హోటల్‌లో హడ్కో ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా తొలి రోజు వర్క్‌షాప్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో ప్రజల ప్రాథమిక అవసరాలైన ఐదు ప్రధాన అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హడ్కో దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అర్బన్ ఇన్వెస్ట్‌మెంట్ విండో' వర్క్‌షాప్ వల్ల పట్టణ ప్రాంతాల అభివృద్ధికి హడ్కో అందిస్తున్న సాంకేతిక, ఆర్థిక మార్గదర్శకాలు ఎంతో దోహదపడతాయన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమృత్ 1.0, అమృత్ 2.0, యూఐడీఎఫ్, ఏఐఐబీ పథకాల ద్వారా ఇప్పటికే రూ.12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ.29,000 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. జనసాంద్రత ఆధారంగా హై, మీడియం, లో డెన్సిటీ ప్రాంతాలుగా విభజించి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో హై, మీడియం డెన్సిటీ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను రూ.9,000 కోట్లతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అర్బన్ క్లియరెన్స్ ఫండ్‌లో రాష్ట్రానికి లభించే రూ.3,600 కోట్లతో పాటు, రాష్ట్ర వాటాగా రూ.10,800 కోట్లను హడ్కో మరియు ఇతర బ్యాంకుల ద్వారా సమీకరించేందుకు 72 మున్సిపాలిటీలకు రీపేమెంట్ సామర్థ్యం ఉందన్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.5,000 కోట్ల విలువైన పనులను 'యాన్యుటీ మోడల్' ద్వారా చేపట్టేందుకు ఆర్థిక శాఖ అనుమతి లభించినట్లు వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అవసరం లేకుండా మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఇంజనీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నిజంగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు పట్టణాల్లోని డ్రైన్లలో పూడికతీత (సిల్ట్ క్లియరెన్స్) పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రానికి ఈ నెలలోనే కేంద్రం నుంచి రూ.3,600 కోట్ల నిధులు రానున్న నేపథ్యంలో, రాబోయే మూడు నెలల్లో అన్ని డీపీఆర్‌లు సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు.

హడ్కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కులశ్రేష్ఠ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ సగటు కంటే వేగవంతమైన ఆర్థిక వృద్ధి రేటుతో దూసుకుపోతోందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు రాకముందే ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ప్రణాళికలు, ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి అవగాహన ఉండటం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి నారాయణ సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రం ఈ నిధులను అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉందన్నారు. హడ్కో కేవలం రుణాలందించే సంస్థ మాత్రమే కాదని, ప్రాజెక్టుల గుర్తింపు, రూపకల్పన నుండి పీపీపీ భాగస్వామ్యాల పర్యవేక్షణ వరకు ప్రతి దశలోనూ ఆంధ్రప్రదేశ్‌కు ఒక నమ్మకమైన అభివృద్ధి భాగస్వామిగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, వ్యవసాయం, ఆక్వా రంగాల బలాలను వాడుకుంటూనే భవిష్యత్తు అవసరాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ వ్యాలీ, డిఫెన్స్, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాలలో ప్రాజెక్టులు చేపట్టాలని పట్టణ స్థానిక సంస్థలకు పిలుపునిచ్చామన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం 25 శాతం గ్రాంట్ అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు వాటాను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

అమరావతి నగరం రూపుదిద్దుకుంటున్న తీరును అభినందిస్తూ, నిరంతరం శ్రమిస్తూ, వాణిజ్య విలువలను, నిబంధనలను బ్యాలెన్స్ చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ రాష్ట్రాన్ని సుస్థిర ప్రగతి వైపు నడిపిస్తున్నారని హడ్కో మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కులశ్రేష్ఠ కొనియాడారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల వేగవంత అభివృద్ధికి మున్సిపాలిటీలు ఆర్థికంగా బలోపేతం కావాలని, అందుకోసం ప్రణాళికాబద్ధమైన 'బ్యాంకబుల్ ప్రాజెక్టుల' రూపకల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ జనాభా 45-50 శాతానికి చేరిందని, ఇంతటి భారీ జనాభాకు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి వసతులు కల్పించాలంటే మున్సిపాలిటీల సొంత ఆదాయం సరిపోదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' (25 శాతం గ్రాంట్) పొందాలన్నా, మిగిలిన నిధులను మార్కెట్ లేదా బ్యాంకుల నుండి సేకరించాల్సి ఉంటుందని, అందుకే ఆర్థిక సంస్థలు నమ్మేలా డీపీఆర్‌లు తయారు చేయడంపై అధికారులు పట్టు సాధించాలన్నారు.

మున్సిపాలిటీలను లేదా మున్సిపల్ సేవలను ప్రైవేట్ పరం చేస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ శాఖలో రూ.15,800 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను (అమృత్, స్వచ్ఛ భారత్, యుఐడీఎఫ్ కింద ఆగిపోయిన పాత పనులతో కలిపి) పునరుద్ధరించి, వేగంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో ప్రతి ఇంటికీ తాగునీరు, డ్రైనేజీ వంటి వసతులు 100 శాతం కల్పన, నిధుల సేకరణకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ పేర్కొన్నారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ గ్రాంట్లపైనే కాకుండా సొంత ఆదాయ వనరులపై పట్టణ స్థానిక సంస్థలు దృష్టి పెట్టాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడకుండా ప్రాజెక్టుల ద్వారా స్వయంగా ఆదాయాన్ని సమకూర్చుకునే కొత్త ఫైనాన్సింగ్ విధానంలోకి మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

తొలి రోజు వర్క్‌షాప్‌లో పైప్‌లైన్ ఆఫ్ బ్యాంకబుల్ ప్రాజెక్ట్స్, ఫ్యాక్టర్స్ ఇంపాక్టింగ్ ప్రాజెక్ట్స్ బ్యాంకబిలిటీ, ప్రాజెక్ట్ ఫార్ములేషన్ అండ్ డీపీఆర్ ప్రిపరేషన్, ప్రాజెక్ట్ రెవెన్యూ ప్రొజెక్షన్, బెస్ట్ ప్రాక్టీసెస్, బడ్జెట్ ఎక్స్‌పెండిచర్, డెట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై హడ్కో అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రెండో రోజు వర్క్‌షాప్‌లో మున్సిపల్ బాండ్స్‌పై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నారు. వర్క్‌షాప్‌లో పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ ఎం. ప్రభాకరరావు, సీఈ ఏ. సుధాకరరావు, కార్తీక్, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు, ఫైనాన్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## బీహార్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన


# ముగ్గురి భౌతికదేహాల తరలింపు

- చెన్నై విమానాశ్రయం నుంచి నెల్లూరుకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- తాజా వివరాలు వెల్లడించిన దేవాదాయ మంత్రి ఆనం

నెల్లూరు (చైతన్యరథం): బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల భౌతిక కాయాలను వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను ఔరంగాబాద్ నుండి పాట్నాకు తరలించిన అనంతరం, ఇండిగో విమానం 6ఇ-619 ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఇండిగో విమానం 6E-6174 ద్వారా చెన్నైకి తరలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విమానం నేడు రాత్రి 10.05 గంటలకు చెన్నై టెర్మినల్-1కు చేరుకోనుందని పేర్కొన్నారు.

మృతదేహాలతో పాటు సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న సోమా పెంచల ప్రసాద్ ప్రయాణిస్తున్నారని తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో మృతదేహాలను స్వీకరించి, అక్కడి నుంచి సురక్షితంగా నెల్లూరు జిల్లాకు తరలించి సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన యాత్రికులకు వైద్య సేవలు, స్వస్థలాలకు తరలింపు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. ఏపీ భవన్, న్యూఢిల్లీ అధికారులు బీహార్ ప్రభుత్వం, స్థానిక జిల్లా యంత్రాంగం, వైద్య అధికారులు మరియు బాధితుల కుటుంబ సభ్యులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన ప్రతి యాత్రికుడు సురక్షితంగా స్వస్థలానికి చేరుకునే వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.



చైతన్యరథం

## రొయ్య రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

# ఆక్వాకల్చర్ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- **ఫీడ్ ధరల అంశంపై పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి**
- **అదనంగా 12 వేల విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 రాయితీ**
- **ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాల ధరలు, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)తో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు –అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్–ఆక్వా జోన్‌లో ఉన్నా –ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. రైతు ప్రతినిధులు తాత్కాలికంగా కిలోకు రూ.6 మేర మాత్రమే ధర పెంపును ఒక నెలపాటు పరిమితం చేయాలని సూచించినట్లు తెలిపారు. అలాగే మత్స్యశాఖ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్ (సీఐబీఏ), రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారుల ప్రతినిధులతో కూడిన శాస్త్రీయ ధరల కమిటీ ఏర్పాటు ప్రతిపాదన కూడా వచ్చినట్లు చెప్పారు. ఈ కమిటీ ముడి పదార్థాల ధరలు, డబ్ల్యూపీఐ తదితర ప్రమాణాలను పరిశీలించి సిఫార్సులు చేయనుందని వివరించారు. ఇదే సమయంలో, కొత్త ధరల విధానం అమల్లోకి వచ్చే వరకు కిలోకు రూ.12 మేర తాత్కాలిక పెంపును పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తయారీదారులు తెలిపారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై తుది ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పరస్పర సంప్రదింపుల ద్వారా త్వరితగతిన పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాస్, ఏపీఎస్ఏడీఏ కో–వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కేంద్ర మత్స్యరంగ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ సంఘాల నాయకులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీదారులు, సముద్ర ఆహార ఎగుమతిదారులు పాల్గొన్నారు.వైసీపీ విష ప్రచారాలను రైతులు నమ్మొద్దు

### దుష్ప్రచారాలకు పాల్పడితే జైలుకే

మంత్రి అచ్చెన్న తీవ్ర హెచ్చరికఅమరావతి (చైతన్య రథం): తోతపూరి మామిడి రైతులను తప్పుదోవ పట్టిస్తూ వైసీపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాలు, కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న విష ప్రచారాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కొనుగోళ్లు, పల్ప్ పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతుల్లో అయోమయం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ మరోసారి తన నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మంత్రి విమర్శించారు. రైతుల సంక్షేమం వంటి సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ప్రభుత్వంపై బురద జల్లడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుంది. ఆధారాలు లేకుండా అబద్ధాలు సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేస్తే సహించేది లేదు. అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం అని మంత్రి హెచ్చరించారు. గత ఏడాది మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరగకుండా తీసుకున్న చర్యల వల్ల వేలాది మంది రైతులకు ఊరట లభించిందన్నారు. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, పరిశ్రమలతో సమన్వయం ఉండేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, సోషల్ మీడియా ముఠాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని, వారి ప్రయోజనాలను కాపాడడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

# మోదీ నాయకత్వంలో నవ భారతం!

- **ప్రధానిగా మోదీ రికార్డు.. దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీక**
- **సమర్థ నాయకత్వంతో దేశ గతిని మార్చిన మోదీ**
- **వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం**



అమరావతి (చైతన్య రథం): ఎన్నికైన ప్రధానమంత్రుల్లో అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రధానిగా నరేంద్ర మోదీ బుధవారంనాడు రికార్డు నెలకొల్పడం నవ భారత ఆవిష్కరణకు శుభ సూచకమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. మే 26, 2014న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ నేటికి (బుధవారం) ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్నారు. ఇప్పటి వరకు దేశ ప్రధానులుగా చేసిన 11మందిలో మొదటి ప్రధాని స్వర్గీయ నెహ్రూ 4,398 రోజులు పదవిలో ఉన్నారు. గత పన్నెండేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో పలు రంగాల్లో అనూహ్యమైన, సానుకూలమైన, ప్రజోపకరమైన మార్పులు సంభవించాయని, ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా దేశ ఖ్యాతి ఇనుమడించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

### సమర్థ నాయకత్వం -ప్రజల విశ్వాసం

2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు కొన్నేళ్లుగా దేశంలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితుల వల్ల నైరాశ్యానికి గురై సమర్థవంతమైన నాయకుని కోసం ఉవ్విళ్లూరిన ప్రజలు నరేంద్ర మోదీని స్పష్టమైన మెజారిటీతో ప్రధానిగా ఎన్నుకున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు వారు తనపట్ల ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సమర్థ నాయకత్వం, సుపరిపాలన, సంస్కరణలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పటిష్ట అమలు ద్వారా మరో రెండుసార్లు ప్రధానిగా ఎన్నికవడం విశేషమని మంత్రి అన్నారు.

10 కోట్లకు పైగా ఎల్పీజీ కనెక్షన్ల ద్వారా వంట చేసే మహిళల సమస్యలు పరిష్కరించడం మొదలుకొని అంతరిక్షంలో అద్భుత విజయాలు సాధించే దిశగా మోదీ నాయకత్వంలో నవ భారతం వడివడిగా అడుగులు వేసిందని, దేశ ఆర్థిక వ్యవస్థ మూడు రెట్లు విస్తరించిందని, ప్రపంచంలో దేశ ఖ్యాతి ఎంతగానో ఇనుమడించిందని మంత్రి వివరించారు. పలు రంగాల్లో సాంకేతిక విజ్ఞానానికి పెద్ద పీట వేస్తూ ప్రజోపయోగం కోసం పెను మార్పులు తెచ్చారని, యూపీఐ ద్వారా 24,000 కోట్ల లావాదేవీలు అత్యంత సులభంగా జరగడం దీనికి నిదర్శనమని మంత్రి అన్నారు.

రూ.45 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), 57 కోట్ల జన్‌ధన్ అకౌంట్లు, భారీ స్థాయిలో ఉన్నత విద్యా వైద్య సంస్థల విస్తరణ, రైతులకు పెట్టుబడి సాయం, భారీ స్థాయిలో పెట్టుబడుల ఆకర్షణ, దేశవ్యాప్తంగా మౌలిక వసతుల విస్తరణ, జీఎస్టీ ద్వారా పన్నుల సంస్కరణ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ వంటి ప్రభావంతమైన చర్యలు, నిర్ణయాల ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలకు ప్రీతిపాత్రుడయ్యారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశ సరిహద్దుల్లో సాహసోపేతమైన సర్జికల్ దాడుల ద్వారా శత్రువుల గుండెల్లో భయాన్ని నింపి దేశ భద్రతకు భరోసానిచ్చారని, వామపక్ష హింసాత్మక చర్యలను అరికట్టి అంతర్గత రక్షణను పటిష్టం చేశారని మంత్రి వ్యాఖ్యానించారు. 'వికసిత్ భారత్' లక్ష్యంగా దేశాన్ని నడిపిస్తున్న ప్రధానిని నరేంద్ర దామోదర దాస్ మోదీగా పిలుచుకోవడం సముచితంగా ఉంటుందని మంత్రి అన్నారు.

# నేడు పిడుగులతో కూడిన వానలు

**జాగ్రత్తలు తీసుకోవాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో రేపు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం అల్లూరి, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ, వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

మరోవైపు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41-42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40-41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

మంగళవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 42.7 డిగ్రీలు, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42.4, మన్యం జిల్లా భామినిలో 42.2, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా పిఠాపురంలో 41.6, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెం 41.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు పేర్కొన్నారు.

చైతన్యరథం

# 21న అమరావతిలో జరిగే 'యోగాంధ్ర'కు బాబా రాందేవ్ హాజరు!

**- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పతంజలి రాందేవ్ బాబాను ఆహ్వానించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే 25 వేల మందిని గ్రూపులుగా విభజించి రాందేవ్ బృందానికి చెందిన వారితోపాటు వివిధ యోగా అసోసియేషన్ల ప్రతినిధులు ఆసనాలు వేయిస్తారని చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి యోగా అండ్ నేచురోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, ఆయుష్ అధికారులు మర్యాదపూర్వకంగా హరిద్వార వెళ్లి బాబా రాందేవ్‌ను నేరుగా ఆహ్వానించబోతున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, జిల్లాల వారీగా పురోగతి, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాందేవ్ వద్ద శిక్షణ పొందుతున్న వారిలో కొందరు విద్యార్థులు ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. వీరు కూడా యోగాసనాలు చేస్తారని చెప్పారు. రాందేవ్ రాకతో యోగాకు మరింత ప్రాచుర్యం పెరుగుతుందని, యోగాంధ్ర ఖ్యాతిని పెంచుతుందని వెల్లడించారు.

**విజయవాడకు వచ్చిన రాందేవ్ ప్రతినిధులు**

యోగాంధ్ర కార్యక్రమానికి రాందేవ్ హాజరవుతుండడంతో సన్నాహక ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయన ప్రతినిధుల బృందం విజయవాడకు చేరుకుంది. ఈ బృందం మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ యోగాంధ్ర-2026 కింద రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి రాందేవ్ బృందానికి వివరించారు. యోగాంధ్ర-2026 కింద చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాందేవ్ బృందం కొనియాడింది.

**నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదింపులు**

ఈ నెల 21న జరిగే రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు (కృష్ణా నదిపై) విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, బ్రిడ్జి సామర్థ్యం, ఇతర అంశాలపై వారి మధ్య చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు హై కెపాసిటీ ఆడియో, వీడియోల ఏర్పాటు, మీడియా స్టేషన్లు, బ్యారికేడ్స్ వంటి ఏర్పాట్లు జాతీయ రహదారిపై జరుగుతున్నాయి.

## 392 కొత్త వైద్యుల పోస్టింగులకు వెబ్ కౌన్సెలింగ్

- **పారదర్శత చర్యల్లో భాగంగా తొలిసారిగా అమలు**
- **20లోగా విధుల్లో చేరేలా 12న పోస్టింగు ఉత్తర్వులు**
- **ఎన్‌హెచ్‌ఎం నోటిఫికేషన్ ద్వారా నియామకాలు**
- **రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

అమరావతి (చైతన్య రథం): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఎంపిక చేసిన వైద్యులకు తొలిసారిగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. పారదర్శక చర్యల్లో భాగంగా ప్రజారోగ్య శాఖలో తొలిసారిగా ప్రవేశపెట్టిన వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని ఎన్‌హెచ్‌ఎంలోనూ అనుసరిస్తున్నామని చెప్పారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు జారీచేసి, మెరిట్ ప్రాతిపదికన ఒప్పంద విధానంలో ఎంబీబీఎస్ అర్హతతో ఎంపిక చేసిన 392 మెడికల్ ఆఫీసర్లకు త్వరలో పోస్టింగులు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. ఒకే అర్హతతో ఆరు కేటగిరి పోస్టులకు ఎంపిక చేసిన వైద్యుల జాబితా అనుసరించి ఈ పోస్టింగులు ఇస్తున్నామని నేడొక ప్రకటనలో మంత్రి సత్యకుమార్ వివరించారు.

**6 కేటగిరిల్లో కలిపి 392 పోస్టులు**

ఈ 392 పోస్టుల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 173, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఎన్‌సీడీ క్లినిక్ నిర్వహణ అవసరాల కోసం 99 పోస్టులు కేటాయించారు. నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల అవసరాలకు 70, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ల కోసం 12, టెలీ మెడిసిన్ హబ్స్ అవసరాల కోసం 25, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల కోసం 13 చొప్పున కలిపి 392 పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇంతకుముందు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కౌన్సెలింగ్ జరిగేది. ఈ విధానంలో ఖాళీలు చూపిస్తే అభ్యర్థులు పోస్టింగ్ స్థానాలు ఎంపిక చేసుకునే వారు.

ఈ విధానంలో సాంకేతికపరమైన సమస్యలు, స్థానాల ఎంపికలో అభ్యర్థులు కాస్త ఇబ్బందులు పడేవారు -ఈ సమస్యలకు వెబ్ కౌన్సెలింగ్ ఫుల్ స్టాప్ పెడుతుంది. 6 కేటగిరిల కింద చూపించిన స్థానాల అన్నింటికీ అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు వెబ్ కౌన్సెలింగ్‌లో ఉంది. ఆప్షన్ల నమోదుకు అనుగుణంగా పోస్టింగు స్థానాలు దక్కుతాయి. ఈ విధానంలో మానవ జోక్యం ఉండదు. ఇందుకు అనుగుణంగా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రవేశపెట్టిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రారంభమైన ఆప్షన్ల నమోదు గడువు బుధవారంతో ముగియనుంది. పోస్టింగు ఉత్తర్వులు శుక్రవారం లేదా శనివారం అభ్యర్థులకు ఆటోమేటిగ్గా జారీ జరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్ జి.వీరపాండియన్ వెల్లడించారు. పోస్టింగు ఉత్తర్వులు పొందిన వారు ఈ నెల 20వ తేదీలోగా విధుల్లో చేరాలని స్పష్టం చేశారు.

## జూన్ 18, 19 తేదీల్లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమీక్ష

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రజా రంగ సంస్థల కమిటీ సమావేశాలు 18, 19 తేదీలలో అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యాలయ కమిటీ హాల్-1లో నిర్వహించనున్నట్లు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సమావేశంలో సంబంధిత అథారిటీలు, కార్పొరేషన్ల స్థాపన లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితి, ఆస్తులు-అప్పులు, సంస్థల కార్యకలాపాలు, సాధించిన విజయాలు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, రోస్టర్ అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఖాతాల నిర్వహణ, ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం, స్వయంప్రతిపత్తి, పనితీరు, సామర్థ్య పెంపు చర్యలు, CSR నిధుల వినియోగం మరియు ఈ-ఆఫీస్ అమలు పరిస్థితులపై కూడా కమిటీ పరిశీలన చేయనుంది.

జూన్ 18న ఉదయం 10.30కు నిర్వహించే సమావేశంలో వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార రంగం, రైతు సంక్షేమం, పశుసంవర్ధక, మత్స్య, వెటర్నరీ మరియు సామాజిక సంక్షేమ రంగాలకు సంబంధించిన సంస్థలను సమీక్షించనున్నారు. వీటిలో ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ, రైతు సాధికార సంస్థ, స్టేట్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఏపీ స్టేట్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ స్టేట్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్, ఏపీ వెటర్నరీ కౌన్సిల్, ఏపీ పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్ వంటి సంస్థలున్నాయి.

జూన్ 19న ఉదయం 10.30కు నిర్వహించే సమావేశంలో ఏపీ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సంస్థల కార్యకలాపాలు, ఆర్థిక మరియు పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

## నాలుగు రాజ్యసభ ఎంపీ అభ్యర్థుల నామినేషన్లు సక్రమమే

**రిటర్నింగ్ అధికారి వణితా రాణి**

అమరావతి (చైతన్య రథం): రాజ్యసభ ఎంపీ ఎన్నికలకు సంబంధించి నలుగురు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వణితా రాణి వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరపున చింతకాయల విజయ్, బాష్యం రామకృష్ణ, సానా సతీష్, జనసేన పార్టీ తరపున లింగమనేని రమేష్ దాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉండడంతో పరిశీలన అనంతరం నలుగురు అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు ఆమె వెల్లడించారు. నాలుగు రాజ్యసభ స్థానాలకు నలుగురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. ఈ నామినేషన్ల పరిశీలనలో ఆయా అభ్యర్థుల తరపున వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

## 5 లక్షలకు చేరిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

**- రోజురోజుకీ పెరుగుతోన్న ఔత్సాహికులు**




అమరావతి (చైతన్య రథం): యోగాంధ్ర-2026 రిజిస్ట్రేషన్లు ఐదు లక్షలకు చేరుకున్నాయి. ఈ నెల 7 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా 3 రోజుల వ్యవధిలోనే ఐదు లక్షలకు చేరుకోవడం విశేషం. తొలిరోజు 25 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సోమవారం నుంచి ఈ సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. యోగాసనాల్లో కోటిమందిని భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు జారీచేసిన ఆదేశాలు అనుసరించి యోగాంధ్ర పోర్టల్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం కనిపిస్తోన్న సానుకూల వాతావరణం ప్రకారం త్వరలోనే కోటి మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు కాబోతున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా గుంటూరు జిల్లాలో 98 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత నెల్లూరు, నంద్యాల, కర్నూలు, పల్నాడు జిల్లాలలో ఎక్కువ మంది పేర్లు నమోదయ్యాయని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు. యోగా అసోసియేషన్ల ద్వారా, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా, ఇతర మద్దతుతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

**లక్ష్యానికి మించి యోగా మాస్టర్ ట్రైనర్ల పేర్లు నమోదు**

యోగాంధ్ర కార్యక్రమానికి యోగా మాస్టర్ ట్రైనర్లలో 5,600 మంది పేర్లు నమోదు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సంఖ్య ఇప్పటికే 6,939కు చేరుకోవడం గమనార్హం. వైఎస్సార్ కడప జిల్లాలో 412, అనకాపల్లి-379, అనంతపురం-342, కర్నూలు జిల్లాలో 310 మంది యోగా మాస్టర్ ట్రైనర్ల పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదయ్యాయి. వాస్తవానికి ప్రతి జిల్లాకు 200 మంది చొప్పున పేర్లు నమోదు చేయించాలని ప్రభుత్వం జిల్లాలకు సూచించింది. మరోవైపు యోగా ట్రైనర్ల కేటగిరిలో 2.5 లక్షల మందిని చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే 1.88 లక్షల మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 9,013 మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. ప్రభుత్వం ఖరారుచేసిన ప్రణాళికలు అనుసరించి జిల్లాల్లో యోగాసనాల కార్యక్రమాలు, థీమ్ బేస్డ్, రకరకాల పోటీలు, ఇతర కార్యక్రమాలు యథావిధిగా జరుగుతున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పార్వతీపురం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఆధ్యాత్మిక ప్రగతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



ఎస్.కోట (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ సనాతన ధర్మ రక్షణకు, ఆధ్యాత్మిక వెలుగులు నింపడానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఎల్.కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎస్.కోట మండలం, సీతారాంపురం గ్రామంలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం 'శ్రీవాణి ట్రస్ట్' నిధుల నుండి రూ.15 లక్షల పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు అధికారిక ఉత్తర్వుల ప్రతిని మీడియాకు చూపిస్తూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ.. సీతారాంపురం గ్రామంలో కేటాయించిన 8.6 సెంట్ల స్థలంలో ఈ ఆలయ నిర్మాణం జరగనుందని, దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం నిర్దేశిత ఏడాది గడువులోగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ఆలయాల సంరక్షణకు, నూతన ఆలయాల నిర్మాణానికి శరవేగంగా నిధులు కేటాయించి ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, రాష్ట్ర ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, పాలకమండలికి నియోజకవర్గ ప్రజల తరపున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# హజ్ యాత్రికులకు విశిష్ట సేవలు అందించిన ఇన్స్పెక్టర్లకు సన్మానం



విజయవాడ (చైతన్యరథం): పవిత్ర హజ్ యాత్ర సందర్భంగా యాత్రికులకు విశిష్ట సేవలు అందించిన హజ్ ఇన్స్పెక్టర్లు రబ్బానీ, ఉస్మాన్ భాషలను ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఘనంగా సన్మానించింది. విజయవాడ హజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన అభినందన సభ లో కమిటీ చైర్మన్ హసన్ భాష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు రాష్ట్ర హజ్ కమిటీ ఈవో గౌస్ పీరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హసన్ భాష మాట్లాడుతూ... కేంద్ర హజ్ కమిటీ పారదర్శక విధానంలో ఎంపిక చేసిన రబ్బానీ, ఉస్మాన్ భాషలు మక్కా, మదీనాల్లో హజ్ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. విజయవాడ, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన ఈ ఇద్దరు ఇన్స్పెక్టర్లు యాత్రికుల సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారికి అందుతున్న సౌకర్యాలపై ప్రతిరోజూ ఆరా తీసేవారని తెలిపారు. యాత్రికుల సేవలపై స్వయంగా వీడియో కాల్స్ ద్వారా సమీక్ష నిర్వహించామని, హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన పలువురు యాత్రికులు కూడా వారి సేవలను ప్రశంసించారని చెప్పారు. దేవుని సన్నిధిలో సేవ చేయడం గొప్ప అదృష్టమని, ఆ బాధ్యతను వారు సమర్థవంతంగా నిర్వర్తించారని పేర్కొన్నారు. ఈవో గౌస్ పీరా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో రాత పరీక్షలు, సేవా దృక్పథం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇన్స్పెక్టర్లను ఎంపిక చేసిందన్నారు. హజ్ యాత్ర సందర్భంగా సుమారు 40 రోజులపాటు యాత్రికులను కంటికి రెప్పలా కాపాడుతూ సేవలందించారని తెలిపారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై వైసీపీది శవ రాజకీయం : ఎంపీ కలిశెట్టి

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద ఘటనపై వైసీపీ వ్యవహరిస్తున్న తీరు పట్ల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. నాడు ఎల్‌జీ పాలిమర్స్ బాధితులను గాలికొదిలేసిన వైసీపీ.. నేడు స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, శాశ్వత ఉద్యోగం ఇచ్చిన మానవతా ప్రభుత్వం ఈ కూటమి సర్కారు అని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామిక రక్షణ గాల్లో దీపమైతే.. నేడు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అహర్నిశలూ శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదాన్ని కూడా రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న శవరాజకీయాలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలోని పారిశ్రామిక నిర్లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమంతోపాటు స్టీల్ ప్లాంట్ మనుగడ కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఉదంతాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్ వ్యవహరించిన తీరును ఆయన ఎండగట్టారు. అందుకు భిన్నంగా ప్రస్తుతం కూటమి సర్కార్ స్పందించిందని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక సోదరుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం దేశ పారిశ్రామిక చరిత్రలోనే ఒక రికార్డు అని అభివర్ణించారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని ఎంపీ కలిశెట్టి వివరించారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలి

అనకాపల్లి (చైతన్యరథం): ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఓటర్ల జాబితా - ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమీక్ష నిర్వహించారు. సర్ ఓటరు జాబితా ప్రక్రియలో టీడీపీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# ఏపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం (చైతన్యరథం): ఏసీఏ - వీడీసీఏ స్టేడియంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. సింహాద్రి వైజాగ్ లయన్స్, కాకినాడ కింగ్స్ తలపడిన మొదటి రోజు మ్యాచ్లో ఎమ్మెల్యే టాస్ వేశారు. ఈ రెండు టీంలతో పాటు తుంగభద్ర వారియర్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్, విజయవాడ సన్ షైనర్స్, భీమవరం బుల్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్లు పాల్గొంటున్నాయి. ఈనెల 30వ తేదీ వరకూ విశాఖపట్నం, కడప, మంగళగిరిలో ఏపీఎల్ మ్యాచ్ లు క్రికెట్ ప్రియులకు వినోదం అందించనున్నాయని గంటా ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. ఐపీఎల్ మాదిరిగా ఏపీఎల్ను కూడా ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్, ఎమ్మెల్యే సుజయ్ కృష్ణ రంగారావు, టీమిండియా టీ20 మాజీ మేనేజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్‌పై అవగాహనే ఆరోగ్య రక్షణకు కవచం

- మహిళల ఆరోగ్యమే కుటుంబ సౌభాగ్యానికి పునాది
- 'సంజీవని'తో మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- 2.71 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు
- ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



తెనాలి (చైతన్యరథం): క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అలవాటు పెరిగితే అనేక ప్రాణాలను కాపాడవచ్చని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. తెనాలిలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, వైద్య సలహా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదని, ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మనిషికి అత్యంత విలువైన సంపద అని పేర్కొన్న ఆమె, వ్యాధులు తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స పొందవచ్చని చెప్పారు. ప్రజల్లో ఉన్న భయాలు, అపోహలను తొలగించి ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన డాక్టర్ రాయపాటి శైలజ, మహిళల ఆరోగ్యమే కుటుంబ సౌభాగ్యానికి పునాది అని పేర్కొన్నారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, కుటుంబ సభ్యులు కూడా వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమాన్ని ఆమె ప్రస్తావించారు. ప్రాణాంతక వ్యాధులను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా పనిచేస్తోందన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 14 సంవత్సరాల లోపు సుమారు 2.71 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని చెప్పారు. వైద్యరంగంలో ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఏ ఆరోగ్య సమస్య తలెత్తినా అధైర్యపడకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, ఆరోగ్య చైతన్యంతో ముందస్తు పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నన్నపనేని ఆంజనేయులు, శాఖమూరి ప్రసాద్, ఈదర పూర్ణచంద్రరావు, సత్యనారాయణ, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్య బృందం, స్వచ్ఛంద కార్యకర్తలను ఆమె అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# విలువైన ఓటును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి

**●స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : మంత్రి కొలుసు పార్థసారథి**




ఏలూరు (చైతన్యరథం): ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలో పొన్నం కళ్యాణ మండపంలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వర్క్‌షాపుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో రాబోయే ఎన్నికల్లో మళ్ళీ కూటమిదే విజయం తధ్యమని, ఇదే తరుణంలో ప్రతి ఒక్కరికీ విలువైన ఓటు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలన చేయాల్సిన బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని మంత్రి తెలిపారు. మండలాలు క్లస్టర్ల వారీగా జరిగిన పార్టీశ్రేణులు ముఖ్యనేతలతో దిశానిర్దేశం చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే జూన్ 14వ తేదీ వరకు నెలరోజులు పాటు జరిగే ఇంటింటి ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. 2002 ఓటర్ల జాబితాలోని పేర్లకు ప్రస్తుత పేర్లకు మ్యాచింగు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వెరిఫికేషను కీలక బాధ్యతగా తీసుకోవాలన్నారు. వైసీపీ పార్టీ నేతలకు ప్రజలు 40 శాతం ఓట్లు వేసినను అసెంబ్లీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కొరకు ప్రశ్నలు అడగరు, సమావేశాలకు హాజరుకారు ఇది ప్రజలకు వెన్నుపోటు పొడవడం కాదా అని ప్రశ్నించారు. 11 సీట్లు వచ్చినను ఎక్కడ కూడా పశ్చాత్తాపం గాని పొరాలు నేర్చుకోవడం లేదని అన్నారు. గత ఐదు సంవత్సరాలు కాలంలో నూజివీడు నియోజకవర్గంలో ఒక్కరోడ్డు కూడా వెయ్యలేదని, ఒక్క చెరువు కూడా అభివృద్ధి చేయలేకపోయారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని వైసిపి పార్టీ అడ్డుకుంటుందని వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోందని, వైసిపి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. 20 నుండి 24 లక్షలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే 9.50 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించామని అన్నారు. రెండు ఏళ్లలో నూజివీడు నియోజక వర్గంలో రూ 386 కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి రూ 14.50 కోట్లు వైద్యసాయం క్రింద నిరుపేదలకు అందజేశామని తెలిపారు. స్త్రీశక్తి పథకం కింద నియోజకవర్గంలో 39 లక్షలు మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఇందుకు రూ 12.52 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిందని అన్నారు. ప్రజలకు మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వైసీపీ పార్టీనేతలు, నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రప్రగతిని ఆపలేరని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్- చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు : సానా సతీష్



విజయవాడ (చైతన్యరథం): సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి మహిళల గౌరవం గురించి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదమని, ఆయనకు ఆ నైతిక హక్కు లేదని టీడీపీ రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో ఆయన వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 11 మందికి రాజ్యసభ సభ్యత్వాలు ఇచ్చినా, కనీసం ఒక్క మహిళకైనా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళల పట్ల నిజమైన గౌరవం ఉంటే అప్పుడే చూపించాల్సిందని అన్నారు. పదవులు పంచేటప్పుడు మహిళలను పట్టించుకోని జగన్, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. “అప్పుడు మహిళలు గుర్తుకు రాని జగన్‌కు, ఇప్పుడు మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతికత ఎక్కడిది?” అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ ప్రకటించినప్పటి నుంచి జగన్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారని సతీష్ పేర్కొన్నారు. మహిళా ఓటు బ్యాంకును ఆకట్టుకునేందుకు అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని ఆరోపించారు. సొంత తల్లిని విశాఖలో రాజకీయంగా ఓడించడం, చెల్లిని రాజీనామా చేయించడం వంటి ఘటనలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కుటుంబ సభ్యులకే గౌరవం ఇవ్వలేని వ్యక్తి రాష్ట్ర మహిళల గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని సానా సతీష్ స్పష్టం చేశారు.

# కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ భరోసా : జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గం బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యత్వ ప్రమాద బీమా కింద ఐదు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కును ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తల సంక్షేమానికి, వారి కుటుంబాల భద్రతకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తను తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తామని, ఇలాంటి కష్టసమయాల్లో వారిని ఆదుకోవడమే కాకుండా భవిష్యత్తులోనూ అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అన్న నందమూరి తారక రామారావు ఆశయ సాధన దిశగా పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రతి కార్యకర్త సంక్షేమానికి పెద్దపీట వేసినప్పుడే పార్టీ ఆశయం నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలకు ధీమా కల్పించేలా ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టి, నిరంతరం వారి భద్రత గురించి ఆలోచించే ఘనత పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కే దక్కుతుందని కొనియాడారు ఈ మొత్తాన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, కష్ట కాలంలో ధైర్యంగా ఉండాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది

**●రోజుకు 400 నుంచి 1800కు చేరిన జీజీహెచ్ ఓపీ**

**●రెండు నోటిఫికేషన్ల ద్వారా 99 మంది సిబ్బంది నియామకాలకు చర్యలు**

**●ప్రజల సూచనలతో ఆసుపత్రి అభివృద్ధికి కూటమి ప్రభుత్వ కట్టుబాటు**

**●రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా తీసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)ని సందర్శించిన ఆయన పలు విభాగాలను పరిశీలించి, రోగులు, వారి బంధువులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీజీహెచ్‌లో వైద్య సేవల నాణ్యత గణనీయంగా పెరిగిందన్నారు. గతంలో రోజుకు సుమారు 400 నుంచి 500 మంది మాత్రమే ఓపీ సేవలు పొందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 1,800కు చేరుకోవడం ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల కారణంగా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ వైద్య సేవలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా ఓపీ సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిందన్నారు. ఆసుపత్రిలో ఉన్న ప్రత్యేక వైద్య విభాగాలను బలోపేతం చేయడం, అవసరమైన పరికరాలను సమకూర్చడం, సిఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం జరుగుతోందని వివరించారు. డాక్టర్లు, టెక్నీషియన్లు, పరిపాలనా సిబ్బంది కొరతను దశలవారీగా భర్తీ చేస్తూ వస్తున్నామని చెప్పారు. గతంలో ఆసుపత్రిలో అవసరమైన మానవ వనరుల్లో కేవలం 20 శాతం మాత్రమే అందుబాటులో ఉండగా, గత రెండేళ్లలో చేపట్టిన చర్యల వల్ల ఆ సంఖ్య 50 శాతానికి చేరుకుందని తెలిపారు. నాలుగైదు సంవత్సరాలుగా నిలిచిపోయిన నియామక ప్రక్రియలను పునరుద్ధరించి రెండు నోటిఫికేషన్లను విడుదల చేయించామని చెప్పారు. మొదటి నోటిఫికేషన్ ద్వారా 39 పోస్టులు, రెండో నోటిఫికేషన్ ద్వారా 60 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో జనరల్ డ్యూటీ అటెండెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, కార్డియాలజీ టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు, ఈసీజీ టెక్నీషియన్లు తదితర పోస్టులు ఉన్నాయని తెలిపారు.

# కార్మికుల విషాదంపై జగన్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

**● విశాఖ అగ్నిప్రమాద ఘటన అత్యంత బాధాకరం : ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ**



గుంటూరు (చైతన్యరథం) : విశాఖలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. అయితే ఘటనపై పూర్తి స్థాయి విచారణ పూర్తికాకముందే జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమానికి దిగడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ప్రజా సమస్యలపై పోరాడలేని వైసీపీ నాయకులు ప్రతి విషాద ఘటనలో రాజకీయ అవకాశాలు వెతకడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పరిశ్రమల భద్రత, కార్మిక సంక్షేమం గురించి పట్టించుకోని జగన్, ఇప్పుడు కార్మికులపై కపట ప్రేమ చూపించడం హాస్యాస్పదమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు చేసిన నిర్లక్ష్యాన్ని మర్చిపోయి ఇప్పుడు నీతులు చెప్పడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. వాస్తవాలు బయటకు రాకముందే అబద్ధాలు, అపోహలు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారని, కార్మికుల కన్నీళ్లలో కూడా రాజకీయ ప్రయోజనం వెతకడం వైసీపీ సంస్కృతిని బయటపెడుతోందన్నారు. విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు అండగా నిలవాల్సింది పోయి రాజకీయ ఆరోపణలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకుని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా సహకరించాలని సూచించారు. కార్మికుల ప్రాణాలను రాజకీయ పెట్టుబడిగా మార్చే జగన్ రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేశారు.

# శ్రీ కోటసత్తెమ్మ ఆలయంలో యోగాంధ్ర కార్యక్రమం... యోగాసనాలు వేసిన పలువురు



నిడదవోలు (చైతన్యరథం): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీకోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోడి నిర్వహించారు. యోగా గురువు డాక్టరు సానెపు సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురితో యోగాసనాలు చేయించారు. యోగా చాలా సులభమైన ప్రక్రియ... వయసుతో సంబంధం లేకుండా అవసరాలకు అనుగుణంగా ఆసనాలు వేయవచ్చు... వీటిలో సూర్య నమస్కారాలు పరిపూర్ణమైన యోగాసనాలుగా గుర్తింపు పొందాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవి శంకర్, యోగా సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- ఓటర్ల జాబితా సవరణపై గన్నవరం కార్యాలయంలో టీడీపీ సమావేశం
- ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకూడదు: వీరంకి గురుమూర్తి



గన్నవరం (చైతన్యరథం): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఓటర్ల నమోదు, సవరణలు, మార్పులు, చేర్పులపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి మచిలీపట్నం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు ఆకుల జయసత్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ... దాదాపు రెండు దశాబ్దాల తర్వాత జరుగుతున్న సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పార్టీ శ్రేణులు అత్యంత బాధ్యతతో తీసుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి ఓటర్ల జాబితాలో చేర్చాలని, నివాస ప్రాంతాలు మారిన వారి వివరాలను సకాలంలో సవరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గన్నవరం, విజయవాడ రూరల్ ప్రాంతాల్లో జనాభా మార్పులు అధికంగా ఉంటాయని, ప్రతి బూత్ పరిధిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని తెలిపారు. గత ప్రభుత్వ పాలనపై ఆయన విమర్శలు గుప్పించారు. వైసీపీ హయాంలో యువత, రైతులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, విదేశీ విద్య వంటి పథకాలు నిలిచిపోవడంతో అనేక మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

నియోజకవర్గ పరిశీలకురాలు ఆకుల జయసత్య మాట్లాడుతూ... ఓటు హక్కు నమోదు అనేది కేవలం ఎన్నికల ప్రక్రియ కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన బాధ్యత అని పేర్కొన్నారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డిజిటల్ విధానాలను వినియోగిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరిని జాబితాలో చేర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో మండల, క్లస్టర్ స్థాయిల్లో కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## నియోజకవర్గ ఆర్థికాభివృద్ధిలో ఆటోనగర్ కీలక పాత్ర పోషించాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

- 11న మంత్రి చేతుల మీదుగా ఆటోనగర్ ప్రారంభోత్సవం, కార్మికులకు పట్టాల పంపిణీ, నూతన షెడ్ల నిర్మాణానికి భూమిపూజ



చిలకలూరిపేట (చైతన్యరథం): నియోజకవర్గ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించేలా స్థానిక ఆటోనగర్‌ను తీర్చిదిద్దుతామని, రవాణా వ్యవస్థలో ప్రధాన భాగస్వాములైన కార్మికుల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. 11న పరిశ్రమల శాఖా మంత్రి టీ.జీ.భరత్ ఆటోనగర్ ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అదే విధంగా అర్హులైన కార్మికులకు తొలివిడత పట్టాల పంపిణీతో పాటు, నూతన షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేయబోతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. మంగళవారం స్థానిక ఆటోనగర్లో 11న జరిగే కార్యక్రమ ఏర్పాట్లను ప్రత్తిపాటి, స్థానిక నాయకులతో కలిసి పర్యవేక్షించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి, కార్మికులతో మాట్లాడి, ఆటోనగర్ అభివృద్ధిపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. విజయవాడ, హిందూపురం ఆటోనగర్‌లకు దీటుగా చిలకలూరిపేట ఆటోనగర్ అభివృద్ధి చెందాలి. ఆటోనగర్‌లో అర్హులకు మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పించామని, ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తైన వారికి 11వ తేదీన (రేపు) పరిశ్రమల శాఖా మంత్రి టీ.జీ.భరత్ చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేయబోతున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు. అదేవిధంగా నూతన షెడ్ల నిర్మాణానికి భూమిపూజ జరుగుతుందన్నారు. పట్టాలు పొందిన వారు విధిగా యూనిట్లు ప్రారంభించాలని, అవసరమైన ఆర్థిక సహాయం కోసం బ్యాంకుల్ని, ప్రభుత్వ విభాగాల్ని సంప్రదించాలని ప్రత్తిపాటి కార్మికులకు సూచించారు. రవాణా వ్యవస్థకు కీలకమైన ఆటోనగర్ అభివృద్ధితో వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. వాహనాల మరమ్మతులతో పాటు.. చిన్న తరహా పరిశ్రమలు, గ్యారేజీలు, వర్క్ షాపులు ఏర్పడితే ఆటోనగర్ ప్రాంతం చిలకలూరిపేట మినీ ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. విజయవాడ, హిందూపురం ఆటోనగర్లకు దీటుగా చిలకలూరిపేట ఆటోనగర్ అభివృద్ధి చెందాలని, కార్మికులు నిబద్ధత, నిజాయితీతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు.

## భూగర్భ జలాలు పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన

- ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాల్ పోస్టర్ ఆవిష్కరణ : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణంలో భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గౌరవ ప్రభుత్వ విప్ మరియు నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య రూపొందించిన "ప్రతి అపార్ట్‌మెంట్‌కు – ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంట" జల చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రైతుపేటలోని కాకతీయ స్కూల్ నూతన భవన ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయుల సమక్షంలో ఈ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజల్లో జల సంరక్షణపై చైతన్యం కలిగించే విధంగా పోస్టర్ రూపకల్పన చేసి అందించిన శ్రీ కత్తురోజు శ్రీనివాసాచారిని తంగిరాల సౌమ్య ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రైతుపేట పరిసర ప్రాంతాల్లోని పలు అపార్ట్‌మెంట్లను సందర్శించిన ఎమ్మెల్యే, ఆయా అపార్ట్‌మెంట్ల ఆవరణల్లో స్వయంగా అవగాహన పోస్టర్లను అంటించి, అపార్ట్‌మెంట్ యజమానులు మరియు నివాసితులతో ముఖాముఖి మాట్లాడారు. పట్టణ విస్తరణ, పెరుగుతున్న జనాభా, భూగర్భ జలాల పరిరక్షణ అవసరాన్ని వివరిస్తూ ప్రతి అపార్ట్‌మెంట్‌లో తప్పనిసరిగా ఇంకుడు గుంటలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వర్షపు నీటిని భూమిలోకి పంపడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని వివరించారు. శాసనసభ్యురాలే స్వయంగా తమ వద్దకు వచ్చి పోస్టర్ అంటించి అవగాహన కల్పించడం పట్ల అపార్ట్‌మెంట్ వాసులు ఆశ్చర్యంతో పాటు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో భాగస్వాములై తమ అపార్ట్‌మెంట్‌లలో ఇంకుడు గుంటలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "హరిత నందిగామ – జలసమృద్ధి నందిగామ" లక్ష్య సాధనలో ప్రతి కుటుంబం, ప్రతి అపార్ట్‌మెంట్ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల

- ఫ్లైఓవర్ సమీక్ష నుంచి ప్రజా దర్బార్ వరకు బిజీ... సీఎంఆర్ఎఫ్ అర్జీలకు తక్షణ ఆన్‌లైన్
- ప్రజా వేదికలో ప్రత్యేక వ్యవస్థ, బాధితులకు ఎమ్మెల్యే భరోసా



గుడివాడ (చైతన్యరథం): ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉద్ఘాటించారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి నాయకత్వం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభివృద్ధి పనుల సమీక్ష నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు రోజంతా బిజీగా గడిపారు. ఉదయం ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో నేషనల్ హైవే డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్ చంద్రలతో రైల్వే గేట్లపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గుడ్ మెన్ పేట పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు సూచించారు. గుడివాడ రైల్వే గేట్ల వద్ద దశాబ్దాలుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపే ఈ ఫ్లైఓవర్ పనులు నిర్దేశించిన గడువులోపు చెయ్యాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాలకు చెందిన పలువురు బాధితులు సీఎంఆర్ఎఫ్ అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. వాటిని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయం తప్పకుండా అందుతుందనీ,అర్జీల నుంచి ఆమోదం వరకు మిగిలిన ప్రక్రియ మేమే స్వయంగా చూసుకుంటామన్నారు. దీనికోసం ప్రజా వేదికలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ కోసం బాధితులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రజా వేదికలోనే పూర్తి ప్రక్రియ చేయించడం కూటమి ప్రభుత్వం చెబుతున్న పారదర్శక పాలనకు ఆచరణ రూపంగా నిలుస్తోందనీ భరోసా ఇచ్చారు. గుడివాడ మార్కెట్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలంటూ అధికారులు నోటీసులు ఇచ్చారని, తమకు సహాయం చేయాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వారికి చెప్పారు. రోజురోజుకూ పెరుగుతున్న పట్టణీకరణ దృష్ట్యా, ప్రజలకు ఇబ్బంది కలిగే చోట మాత్రమే ఆక్రమణలు తొలగిస్తామని, ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం మాకు లేదనీ స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే భాష్యం

- 98వ రోజుకు చేరిన ప్రజలకు వద్దకు ప్రవీణ్ 100 రోజుల కార్యక్రమం... ప్రజల నుంచి వినతుల స్వీకరణ



పెదకూరపాడు (చైతన్యరథం): 98వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అచ్చంపేట మండలం వేల్పూరులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలకు లింక్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో ఇప్పటికే 60శాతం రోడ్లను నిర్మించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రికి వివరిస్తామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో అవసరమైన నిధులను తెచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి కోసం 21.21కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మండల, గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ఘనంగా విక్రమ సింహపూరి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

**●ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, వర్సిటీ ఛాన్సెలర్ ఎస్. అబ్దుల్ నజీర్**

**●గౌరవ డాక్టరేట్లు అందుకున్న డా. కె.వి. వరప్రసాద్‌రెడ్డి, గోబర్ధన్ దాస్, బీదా మస్తాన్ రావు**

**●పాల్గొన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**



కోవూరు (చైతన్యరథం): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10,11,12వ స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం నెల్లూరు గోలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సెలర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా నెల్లూరు లోక్‌సభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. అంతకుముందు, స్నాతకోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి, సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో విశేష సేవలందించిన డాక్టర్ కె.వి.వరప్రసాద్‌రెడ్డి (పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్), గోబర్ధన్ దాస్ (నీతి ఆయోగ్ సభ్యులు), బీదా మస్తాన్‌రావు (రాజ్యసభ సభ్యులు)కి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖులకు వేమిరెడ్డి దంపతులు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, గవర్నర్‌కి కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న యూజీ, పీజీ విద్యార్థులతో పాటు, పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న 21 మంది విద్యార్థులు, గోల్డ్ మెడల్స్ సాధించిన 45 మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు.

# సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

**● మార్కాపురంలో శిక్షణా తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల**



మర్కాపురం (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్‌లో జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫౌండేషన్ లీటరసీ న్యూమరసి శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒకటి మరియు రెండవ తరగతుల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని తద్వారా 1,2 తరగతి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించవచ్చు అని అన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటారని ఆ స్కూల్ హెడ్మాస్టర్‌కి ఈనెల 19వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ డే మీటింగ్ రోజున లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందజేస్తానని అన్నారు. అదేవిధంగా 580 మార్కులు దాటిన వారికి కూడా ఆ స్కూలుకు వెళ్లి త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని అన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని మంచి విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టవచ్చునని తద్వారా వారు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ మానవత్వం.. నెల్లూరు ప్రజల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం

**●వైద్య రంగంలో సరికొత్త రికార్డు.. 8,400 మందికి పైగా ఉచితంగా నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష సేవలు**



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తూ.. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సొంత నిధులతో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారు.. ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అందించడమే ధ్యేయంగా నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి మరియు నారాయణ దంత సురక్ష ఉచిత పరీక్షల వైద్యశిబిరం విజయవంతంగా 3 నెలలు పూర్తి చేసుకుని, ఇప్పటివరకు ఏకంగా 8,400 మందికి పైగా నిరుపేదలకు ఉచిత చికిత్సను అందించింది..సామాన్య ప్రజల పనులకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే మానవతా దృక్పథంతో, ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరుగుతున్న ఈ మెగా హెల్త్ డ్రైవ్‌ను.. ఈరోజు 8వ డివిజన్ పరిధిలోని రామచంద్రాపురం, శ్రీదేవి రైస్ మిల్లు దగ్గర అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 3 కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన హైటెక్ నారాయణ ఆన్ వీల్స్ ద్వారా ఉచితంగా కంప్యూటరైజ్డ్ కంటి, దంత పరీక్షలు చేసి, కేవలం రెండు రోజుల్లోనే సరికొత్త అద్దాలను నేరుగా వారి ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారు. అంతేకాదు, క్యాటరాక్ట్ అవసరమైన రోగులను హాస్పిటల్ వాహనాల్లోనే ఉచితంగా తీసుకెళ్లి కార్పొరేట్ ఆపరేషన్లు పూర్తి చేసి, తిరిగి భద్రంగా ఇళ్లకు చేరుస్తున్నారు..అలాగే షుగర్ పేషెంట్లకు ఎంతో ఖరీదైన ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్స్ ను సైతం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి రోగిని సొంత మనిషిలా భావించి డాక్టర్లు అందిస్తున్న ఈ అపూర్వ సేవలకు గానూ.. రామచంద్రాపురం స్థానిక ప్రజలు మంత్రి పొంగూరు నారాయణ గారి సేవా హృదయానికి శతకోటి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సుధా ,రఫీ, AGM శేఖర్ రెడ్డి, 8వ డివిజన్ ప్రెసిడెంట్ బి.సి. బాబు క్లస్టర్ హెడ్ హేమంత్, మహిళా శక్తి ఇంచార్జ్ ఉమామహేశ్వరి, యూనిట్ ఇంచార్జ్ పాలూరు శ్రీనివాసులు, స్థానిక నేతలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం

**●ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హెచ్చరిక**



చీరాల (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో అనుమతి లేకుండా అభివృద్ధి చేస్తున్న లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హెచ్చరించారు. పట్టణ అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని లే అవుట్లు సంబంధిత శాఖల అనుమతులతోనే చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల చీరాల పరిసర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లు పెరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు స్థలాలు కొనుగోలు చేసే ముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందిన లే అవుట్లేనో కాదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అనుమతి లేని లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలను మోసం చేసే రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ లే అవుట్ల అభివృద్ధిని వెంటనే నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని, చీరాల అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా మాత్రమే లే అవుట్లు ఉండాలని ఎమ్మెల్యే మద్దుల కొండయ్య పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ నిర్మాణాలు, అనధికారిక లే అవుట్లను గుర్తించి చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒహుడా చైర్మన్ షైక్ రియాజ్,తహసీల్దార్ కె.గోపికృష్ణ, అర్బన్ డెవలప్మెంట్ మూడు జిల్లాల అధికారి మధు, పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

# నెల్లూరు ప్రభుత్వ బడి.. ఇంటర్నేషనల్ స్టడీ

**● మూలపేట డీఎస్ఆర్ స్కూల్‌ను పరిశీలించిన పొంగూరు షరిణి**

**● స్కూల్ పనులను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి నారాయణ కుమార్తె**



నెల్లూరు (చైతన్యరథం): నగర విద్యావ్యవస్థలో కార్పొరేట్ విద్యాసంస్థల గుత్తాధిపత్యానికి తెరదించుతూ.. ప్రభుత్వ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టాయి. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పంతో, దాత సుధాకర్‌రెడ్డి ఉదారతతో నెల్లూరు 39వ డివిజన్ మూలపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను మంత్రి కుమార్తె పొంగూరు షరిణి స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అత్యద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యతను మా నాన్న నాకు అప్పగించారని, గతంలో విఆర్ స్కూల్‌కు సెట్ చేసిన స్టాండర్డ్స్ కంటే మిన్నగా ఈ స్కూల్‌ను ముస్తాబు చేశామని సగర్వంగా ప్రకటించారు. 2.5 ఎకరాల విస్తీర్ణంలో, 24,000 చదరపు అడుగుల వైశాల్యంతో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లతో నిర్మితమైన ఈ అక్షరాల కోట జూన్ 12 నుండి ప్రారంభం కానుందని, నర్సరీ నుండి 10వ తరగతి వరకు దాదాపు 500 మంది పైగా నిరుపేద విద్యార్థులు ఇక్కడ అంతర్జాతీయ స్థాయి చదువులను ఉచితంగా అభ్యసించవచ్చని, ఇక్కడి విద్యా ప్రణాళికను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని షరిణి స్పష్టం చేశారు.? కేవలం 8 నెలల రికార్డు కాలంలో రూపుదిద్దుకున్న ఈ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్కూళ్లకు మైండ్ బ్లాక్ అయ్యేలా అత్యంత ఆధునిక వసతులను కల్పించారని. రాష్ట్రంలోనే అత్యంత వినూత్నమైన రోబోటిక్ ల్యాబ్, హైడ్రోపోనిక్స్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్‌తో పాటు ప్రత్యేకంగా ఆర్ట్ మరియు డాన్స్ రూమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. కేవలం చదువే కాకుండా విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన అంతర్జాతీయ స్థాయి కబడ్డీ, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ నెట్స్ మరియు బాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం సురక్షితమైన ఆరో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారని తెలిపారు.. మంత్రి నారాయణ పిలుపునకు స్పందించి ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంతటి భారీ ప్రాజెక్టును సాకారం చేసిన దాత సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పొంగూరు షరిణి ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# యోగా వేదికను పరిశీలించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్



గుంటూరు (చైతన్యరథం): అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన నిర్వహించనున్న యోగ వేడుకల ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి వీర పాండియన్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రెటరీ రోణంకి గోపాల కృష్ణ పరిశీలించారు. వెస్ట్రన్ బైపాస్ లో తుళ్ళూరు మండలం దొండపాడు వద్ద వేదికను పరిశీలించారు. యోగాలో పాల్గొనే అభ్యర్థులు వచ్చే మార్గాలు వారి వాహనాలకు పార్కింగ్ సౌకర్యంతో పాటు తాగునీరు మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నందున అందుకు గల ఏర్పాటును కూడా చర్చించారు. యోగ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయుటకు అధికారి యంత్రాంగం సమాయాత్తం అయింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి వీర పాండియన్ మాట్లాడుతూ ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. 25 వేల మందితో యోగా కార్యక్రమం చేస్తున్న చేయడం జరుగుతుందని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్‌వర్మ మాట్లాడుతూ యోగాంధ్ర 2026 కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వెస్టర్న్ బైపాస్ పై యోగా ఆంధ్ర కార్యక్రమం జూన్ 21న జరుగుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# వైసీపీది నిత్యం ఫేక్ బతుకే

**●నిస్పాక్షికంగా డిఎస్సీ నిర్వహణ... టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డి**



కడప (చైతన్యరథం): అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల స్వల్ప కాలంలోనే మెగా డీఎస్సీని నిర్వహించి, కూటమి ప్రభుత్వం అంటే ఏంటో ప్రాక్టికల్‌గా నిరూపించామని తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కడప నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ... మెగా డీఎస్సీ నిర్వహణపై వైసీపీ నాయకులు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇంతటి బృహత్తర కార్యక్రమంపై దుష్ప్రచారం చేయడం వైసీపీ నాయకులు తక్షణమే మానుకోవాలని ఆయన హితవు పలికారు. గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అనేది ఒక కలగానే మిగిలిపోయిందని ఆయన విమర్శించారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలను గత ప్రభుత్వం అణచివేసిందని మండిపడ్డారు. అదే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో , మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి, వేలాది మంది నిరుద్యోగుల కళ్లల్లో ఆనందాన్ని నింపామని భూపేష్‌రెడ్డి ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఎంతో నిస్పక్షపాతంగా నిర్వహించిన డిఎస్సీపై ఆరోపణలు మానుకోని పక్షంలో వైకాపాకు నిరుద్యోగులే బుద్ధి చెపుతారని హెచ్చరించారు. సమావేశంలో తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, టి ఎన్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్, మనోజ్ లు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంటు ప్రమాదంపై వైసీపీ తప్పుడు ప్రచారం

**●మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండ**

**●గతంలో తాడేపల్లి ప్యాలెస్ గడప దాటని జగన్**

**●అబద్ధాలు, అసత్యాలతో నీలి మీడియా దుష్ప్రచారం**

**●తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజం**




తణుకు (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ప్రమాదంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తూ ఉందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన, క్షతగాత్రులైన కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం కూటమి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ప్రమాదం జరిగిన తక్షణమే ప్రభుత్వం సంబంధిత అధికారులు, మంత్రులను ఘటనా స్థలానికి పంపి సహాయక చర్యల్లో పాల్గొనేలా అప్రమత్తం చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మతో పాటు కేంద్ర మంత్రి కుమారస్వామి స్పందించి అధికారులను అప్రమత్తం చేశారని చెప్పారు. అయితే ఈ ప్రమాదంపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి, వైసీపీ, సాక్షి కలిసి ప్రమాదంపై తప్పుడు ప్రచారాలు చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. క్షతగాత్రులను పరామర్శించే సమయంలో మంత్రి లోకేష్ దుర్భాషలాడినట్లుగా చిత్రీకరించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ గడప దాటలేదని ఎద్దేవా చేశారు. వివేకానంద రెడ్డిని హత్య చేసి చంద్రబాబు నాయుడుపై నెపం వేసి తప్పుడు ప్రచారం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా అబద్దాలు, అసత్యాలతో సాక్షి పత్రిక నీలి మీడియాగా మిగిలిపోయిందని అన్నారు. క్షతగాత్రులను పవన్ కళ్యాణ్, లోకేష్ పరామర్శించి ఘటనా స్థలాన్ని సందర్శించారని తెలిపారు. కష్ట కాలంలో కూటమి ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ప్రభుత్వం తీసుకున్న చర్యలకు నిదర్శనమని అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ. 25 లక్షలు క్షతగాత్రులైన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని గుర్తు చేశారు. కేవలం నష్టపరిహారం ఇవ్వడమే కాకుండా కుటుంబాలకు అండగా నిలబడే విధంగా ప్రతీ కార్మికుడు తన వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి మోడీ ఉన్నారనే ధైర్యాన్ని కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణ చేయవద్దని పోరాడడంతోపాటు అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి రూ. 1500 కోట్లు పరిహారం తీసుకువచ్చి స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తిని పెంచే విధంగా ప్రభుత్వం కార్మికులకు భరోసా కల్పించిందని తెలిపారు.

# ప్రతి ఇంటిని బీఎల్‌ఏలు సమగ్రంగా మ్యాపింగ్ చేయాలి

**●పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సూచన**

**●ఎస్ఐఆర్‌పై ఆత్మకూరు, అనంత రూరల్ నాయకులకు అవగాహన**

**●క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచన**

**●ప్రతి ఓటు కీలకమన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్**



ధర్మవరం (చైతన్యరథం): మరో వారం రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలుకానున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో బీఎల్ఏలు ప్రతి ఇంటిని సమగ్రంగా మ్యాపింగ్ చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల నాయకులకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులోని బి.వి.ఎస్ ఫంక్షన్ హాల్లో ఆత్మకూరు మండల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం రూరల్ మండల నాయకులకు రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతో పాటు మండల ముఖ్యనాయకులు పాల్గొనగా.. ఎస్ఐఆర్ పై వారికి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ దిశానిర్దేశ్యం చేశారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమవుతుందని.. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారని చెప్పారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేయాలన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుని పని చేయాలని సూచిస్తూ పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ జాబితాలను నాయకులకు అందజేశారు.

# లోకేష్‌పై జగన్ అండ్ కో ఫేక్ ప్రచారాలు చేస్తోంది : కేంద్ర మంత్రి రామ్మోహన్



శ్రీకాకుళం (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై .. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కోకి లోకేశ్ అంటే భయమని, అందుకే ఆయనను టార్గెట్‌గా చేసుకుని ఫేక్ ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాల్లో రామ్మోహన్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని కూటమి ప్రభుత్వం తిప్పి కొట్టిందని రామ్మోహన్ తెలిపారు. వైసీపీ తాను తీసిన గోతిలో తానే పడిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌లో ఏపీ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని ఉద్ఘాటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన దురదృష్టకరమని చెప్పారు. బాధిత కుటుంబాలకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఆదుకుంటుందని రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు.

# తెలుగు జాతి గర్వకారణం ఎన్టీఆర్... ప్రజాసేవకు చిరునామా ధూళిపాళ్ల వీరయ్య చౌదరి



ప్రత్తిపాడు (చైతన్యరథం): నియోజకవర్గంలోని కాకుమాను మండలం, పాండ్రపాడు గ్రామంలో నందమూరి తారక రామారావు విగ్రహం మరియు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్... ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు ఎమ్మెల్యేలు రామాంజనేయులుకి, నరేంద్రకి ఘన స్వాగతం పలికారు. మొదటిగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ... తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత, పేదల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలు అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు, ఎన్టీఆర్ రాజకీయాలను ప్రజాసేవకు వేదికగా మార్చి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. రూ.2 కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడం వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు ఆయన నాయకత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, క్షీర విప్లవ సారధిగా, రైతుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు.

# రాష్ట్ర కురుబ సంఘం పేరిట నియామకాలు చెల్లవు



ఆదోని (చైతన్యరథం): నియోజకవర్గం కురుబ సంఘం కమిటీని జూన్ 6న నూతన కమిటీని నియామకం చేశారని, నియామక పత్రంలో రిజిస్టర్ నెంబర్13/2017గా వున్నదని, ఎస్కే మల్లికార్జున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కురువ సంఘం ఈ నంబర్‌ని అధ్యక్షుడిగా సంతకం పెట్టి నియామక పత్రాలు జారీ చేశారని అవి చల్లవని సౌత్ ఇండియా కురువ సంఘం నాయకులు దెబ్బల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ను వెంటపడి కార్పోరేషన్లు సాధించామని, కార్పొరేషన్ల చైర్మన్‌గా ఎవరున్నా పర్వాలేదు మా వాడే ఉన్నాడనే ధీమాలో ఉన్నామే తప్ప, ఎక్కడ రాజకీయాలు చేయలేదన్నారు. సంఘంలోని నాయకులు మంత్రి సవితమ్మకు ఎక్కడా చెడ్డ పేరు తీసుకురాకూడదని, సంఘంలోని నాయకులకు సూచించారు. ఎస్.కే మల్లికార్జున ఏ బైలా ప్రకారం ఎన్నిక కాబడ్డారు? రిజిస్టర్ బాడీ నెంబర్ (13/2017) పేరిట మీటింగ్లు నిర్వహించారా? ఏ విధంగా అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు? ఈ రిజిస్టర్ నెంబర్ (13/2017) ద్వారా నియామక పత్రాలు, ప్రకటనలు,లెటర్ ప్యాడ్లు,ప్రచురించినచో వారి పైన చట్టపరమైన క్రిమినల్ కేసులు, డిఫర్మేషన్ సూట్లు వేస్తామని హెచ్చరించారు.

## లాస్‌ఏంజెల్స్‌లో సిలికానాంధ్ర
# మనబడి స్నాతకోత్సవం



లాస్ ఏంజెల్స్: లాస్ ఏంజెల్స్ మనబడి, సంపద తరగతుల స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా రాజ్ మంచిరాజు, ఆచార్య మృణాళిని హాజరై పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సిలికానాంధ్ర అమెరికాలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు నేర్పాలని "భాషా సేవయే భావితరాల సేవ" అనే భావనతో గత 19 ఏళ్లుగా నిరంతర కృషిచేస్తోంది. ముఖ్యంగా చదవడం, రాయడం, మాట్లాడడం, వినడం అంశాల్లో పిల్లలను ప్రోత్సహిస్తోంది. పాఠ్యాంశాలతో పాటు పాఠ్యేతర అంశాలైన "పిల్లల పండుగ", "తెలుగు మాట్లాట" వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు పిల్లల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. అమెరికాలో ప్రతి తెలుగు కుటుంబంలో తెలుగును వినియోగించే లక్ష్యంతో ముందుకు







సాగుతోంది. సిలికానాంధ్ర మాతృ సంస్థ ఈ ఆగస్టులో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రజతోత్సవాలు జరుపుకుంటోంది. ఈ స్నాతకోత్సవ వేడుకలను లాస్ ఏంజెల్స్ ప్రాంతీయ సమన్వయకర్త చంద్రశేఖర్ వెంపటి, సహ సమన్వయకర్తలు రామకృష్ణ పేరం, క్రాంతి నడకుడితి నిర్వహించారు. శ్రీకాంత్ కొల్లూరు పిల్లలతో తెలుగుభాషను పరిరక్షించి అభివృద్ధి చేసే మనబడి ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యఅతిథులు ఆచార్య మృణాళిని, రాజ్ మంచిరాజు మాట్లాడుతూ తెలుగు అవసరంపై విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపక వర్గం, సమన్వయకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఈ స్నాతకోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.

## ఉత్సాహంగా
# టీసీఏ కిక్ ఆఫ్ మీటింగ్



హ్యూస్టన్: హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి గోల్డెన్ జూబ్లీ సంబరాలను పురస్కరించుకుని మాజీ అధ్యక్షుడు, తెలుగు ప్రముఖుడు వంగూరి చిట్టెంరాజు నివాసంలో ఏర్పాటు చేసిన కిక్ ఆఫ్ మీటింగ్ గ్రాండ్ సక్సెస్ అయింది. ఈ వేడుకల గురించి ఆయన మాట్లాడుతూ ఉత్సాహంగా కార్యక్రమంలో తనతో పాటు దేవి, పద్మజ, సుభద్ర, భ్రమరా, అనిలజ, వల్లి, ఉమా మంత్రవాది, ప్రసాద్ పాల్గొని సహకారం అందించారని తెలిపారు. టీసీఏ కోసం చేసిన కిక్ ఆఫ్ మీటింగ్‌కు వచ్చి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను చేసిన ప్రతి పనికి నా మీద నమ్మకంతో చేదోడు వాదోడుగా ఎప్పుడు డొనేషన్స్ అడిగినా ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. 45,000 డాలర్లు విరాళాలుగా ఇచ్చేందుకు కమిట్‌మెంట్లు రావడం సంతోషకరమని పేర్కొంటూ ఇంకొక 5,000 డాలర్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మరికొంత మంది డోనర్స్ విరాళాలు ఇస్తామని కమిట్ అయ్యారు. చాలా సరదాగా జరిగిన కిక్ ఆఫ్ మీటింగ్‌లో ఉమా మంత్రవాది పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం విజయవంతం చేసిన వారిని చిట్టెంరాజు అభినందించారు.

# గానగంధర్వుడికి స్వర నీరాజనం

- న్యూయార్క్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు
- తెలుగు సమాజం, కళాభిమానుల నుంచి అపూర్వ స్పందన

న్యూయార్క్: ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతి వేడుకలు న్యూయార్క్‌లో ఘనంగా నిర్వహించారు. న్యూయార్క్ తెలుగు సమాజం నుంచి అపూర్వ స్పందన లభించింది. సంగీత మాధుర్యం, మధుర స్మృతులు, హృదయాన్ని తాకే సంగీత నివాళులతో ఈ కార్యక్రమం చిరస్మరణీయ సంగీత విభావరిగా నిలిచింది. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన శరత్‌చంద్ర "స్వర వైభవరి" కార్యక్ర మం ద్వారా గాన మహానుభావులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఘంటసాలకు తన స్వరంతో సంగీత నివాళులర్పించారు. మరో ప్రత్యేక అతిథి







మిమిక్రీ రమేష్ తన సహజ హాస్యంతో ప్రేక్షకులను అలరిం చడమే కాకుండా అద్భుత గానంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి తమ బృందాలతో విచ్చేసిన న్యూయార్క్ జాతీయ, స్థానిక తెలుగు సంఘాల నాయకత్వా నికి, కష్టమైన వీకెండ్‌లో కూడా కుటుంబాలతో పాల్గొని విజయవంతం చేసిన గాయకులకు, సంగీతాభిమానులకు ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ కృతజ్ఞతలు తెలిపింది. అమెరికాలోని పలు రాష్ట్రాల నుంచి గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పద్మ కొడెల, వారి కుమార్తె రూపొం దించిన అద్భుత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలు అక్షరాలతో అలంకరించిన భారీ "30" కాన్వాస్, పూల అలంకరణలు, రంగురంగుల తోరణాలు సభా వేదికను సంగీ తోత్సవ వాతావరణంగా మార్చాయి.

### శరత్‌చంద్ర, మిమిక్రీ రమేష్‌కు సన్మానం

ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ చైర్మన్ హరి ఎప్పనపల్లి గాయకులను అభినందిస్తూ భావితరాల గాయకులను తీర్చిదిద్దేందుకు ఎస్పీబీఎంఏ నిరంతరం శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం హరి ఎప్పనపల్లి, అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు, ఉపాధ్యక్షురాలు రాజీ బుర్ర, కార్యవర్గ సభ్యుడు కుమార్ బుద్ధరాజు, పలువురు సంఘ నాయకులు కలిసి ఘంటసాల సంగీత పరిరక్షణకు, వేలాది మంది విద్యార్థులకు సంగీత శిక్షణ అందించేందుకు చేసిన శరత్‌చంద్రను గాన కళా తపస్వి బిరుదుతో ఘనంగా సత్కరించారు. అలాగే మిమిక్రీ రమేష్‌ని కూడా ఘనంగా సన్మానించి అమెరికా పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నసావ్ కౌంటీ ఎగ్జిక్యూటివ్ బ్రూస్ బ్లేక్మన్ కార్యాలయం తరఫున జింగ్ జావో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంఘాలు, సమాజానికి అందిస్తున్న సహకారానికి ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ తరపున నసావ్ కౌంటీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్పీబీఎంఏ సలహాదారు, ఇగ్నో డైరెక్టర్, మీడియా నిపుణుడు, భారత ప్రభుత్వ మీడియా వ్యవహారాల సలహాదారు రవి అయ్య గారి, ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ బోర్డు సభ్యురాలు సుజాత వెంపరాల కూడా కార్యక్రమ విజయానికి తమ శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ దొమల, విజయేందర్ బాస, రామ వనమ, కుమార్ బుద్ధరాజు, ప్రసాద్ సానపతి కార్యక్రమానికి లాజిస్టిక్ సహకారం అందించారు.

# పాస్‌పోర్ట్ ఆఫీసర్ కృష్ణకు ఆత్మీయ వీడ్కోలు

- ◆ సాంస్కృతిక కళాసారథి సంస్థ ఆధ్వర్యంలో సన్మానం
- ◆ తెలుగువారికి సేవలు చిరస్మరణీయమని ప్రశంసలు
- ◆ మధురజ్ఞాపకంగా గుర్తుండిపోతుందన్న కృష్ణ



సింగపూర్: భారత హైకమిషన్‌లో పాస్‌పోర్ట్ ఆఫీసర్‌గా సేవలందించి బదిలీపై స్వదేశానికి వెళుతున్న వై.ఎస్.వి.ఎస్.ఆర్.కృష్ణకు సింగపూర్‌లోని సాంస్కృతిక కళాసారథి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం జరిగింది. 50 మందికి పైగా హాజరైన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కవుటూరు రత్నకుమార్ మాట్లాడుతూ సింగపూర్‌లో తెలుగువారికి అత్యవసర పరిస్థితుల్లో కృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. పాస్‌పోర్ట్ సమస్యలే కాకుండా భారత హైకమిషన్‌కు సంబంధించి అంశాలలో ఆయన



అందించిన సహకారం ఎంతోమందికి ఉపయోగపడిందని అభినందించారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని స్పందించి సహాయం చేయడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. సింగపూర్‌లో గత మూడున్నరేళ్లుగా వ్యక్తిగతంగా సాంస్కృతిక కళాసారథి సంస్థ ద్వారా కృష్ణతో ఏర్పడిన ఆత్మీయ అనుబంధం తమ అదృష్టంగా భావిస్తున్నా మని, ఆయన బదిలీ సింగపూర్ తెలుగు సమాజానికి ఒక లోటుగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.

### తెలుగువారితో అభిమానం మరువలేను: కృష్ణ

అనంతరం కృష్ణ మాట్లాడుతూ వారాంతమైన ఆదివారం రోజున ఇంతమంది తెలుగు సోదరులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేసి తనను సత్కరించడం హృదయానికి హత్తుకుందని సంతోషం వ్యక్తం చేశారు. సింగపూర్‌లో గడిపిన ఈ కాలం తన జీవితంలో మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ఇంతమంది తెలుగువారి అభిమానాన్ని పొందడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కొవిడ్ అనంతరం కాలంలో సింగపూర్‌లో బాధ్యతలు స్వీకరించినప్పుడు అనేక అత్యవసర, క్లిష్టమైన కేసులు ఎదురయ్యాయని పేర్కొంటూ వారాంతాలు, కార్యాలయ సమయాలు అనే పరిమితులు లేకుండా వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు కృషిచేశానని తెలిపారు. కొన్ని క్లిష్టమైన కేసులను ఎలా పరిష్కరించారో ఉదాహరణలతో వివరించారు. సింగపూర్‌లోని తెలుగు వారందిరితో తనకు ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వివిధ తెలుగు సంస్థలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. భారతీయులు మాత్రమే కాకుండా సింగపూర్ పౌరసత్వం పొందిన భారతీయ మూలాల ప్రజలు భారతదేశానికి వెళ్లే సందర్భంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాంబాబు పాతూరి, చామిరాజు రామాంజనేయులు, సుధాకర్ జొన్నాదుల, శ్రీధర్ భరద్వాజ్, సుబ్బు వి.పాలకుర్తి పాల్గొన్నారు. అలాగే ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ కుమారుడు కె.నాగేంద్రతో పాటు సింగపూరు చెందిన పలువురు తెలుగు ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సరిగమ గ్రాండ్ రెస్టారెంట్ యజమాని సురేంద్ర చేబ్రోలు, మనోహర్ ఇంటూరి, మోహన్ నూకలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అప్పీలు విచారణకు 40 ఏళ్లా..

### అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



ఢిల్లీ: ఓ హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పొందిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీలుపై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు 40 ఏళ్లకు పైగా సమయం తీసు కోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవరపాటుకు గురి చేస్తున్నాయని, పేరుకుపోతున్న కేసులను పరిష్కరిం చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హై కోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది.
ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్ సింగ్ 1983 నవంబర్‌లో తన తమ్ముడి హత్య కేసులో అరెస్టయ్యాడు. అప్పుడు విజయ్ వయసు 28 సంవత్సరాలు. ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేశాడు. అయితే ఆ అప్పీలుపై తుది నిర్ణయం రావడానికి నాలుగు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడి అప్పీలును అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకో ర్టు విచారిస్తోంది. మొత్తం ఈ 43 ఏళ్ల కాలంలో విజయ్ మూడు నెలలు మాత్రమే జైలులో ఉన్నాడు. మిగిలిన సమయం అంతా తన అప్పీలుపై తీర్పు కోసం ఎదురుచూస్తూ బయటే గడిపాడు. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ సమయంలో కూడా అతడికి బెయిల్ కొనసాగుతోంది. అప్పీలుపై విచారణ కోసం అలహాబాద్ హైకోర్టు ఏకంగా 41 ఏళ్ల సమయం తీసుకోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

## డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు 50 ఏళ్లు!

### కేంద్రం పొడిగించే అవకాశం



ఢిల్లీ: దేశంలోని కోట్లాది మంది వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకోబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం డ్రైవింగ్ లైసెన్స్ వ్యాలిడిటీ 20 సంవత్సరాలుగా ఉంది. ఆ వ్యాలిడిటీని 50 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, వాహనదారులు తరచుగా లైసెన్స్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండ దు. దీంతో ఆర్‌టీవో కార్యాలయాలపై భారం తగ్గడంతో పాటు ప్రజలకు సమయం, ఖర్చు కూడా ఆదా కానుంది. ఇక, వాహన యాజమాన్య బదిలీ, పర్మిట్ పునరుద్ధరణ, ఇతర రవాణా సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని కూడా కేంద్రం యోచిస్తున్నట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా శాఖ అధికారులు, ఇతర భాగస్వాములతో చర్చించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది (RTO reforms). కాగా, ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి మంత్రిత్వ శాఖ ఎటువంటి కాలపరిమితినీ ప్రకటించలేదు. అలాగే చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

## సంతకాల ఫోర్జరీ కేసు..

# మమతా బెనర్జీ కార్యాలయానికి సీఐడీ టీమ్

కోల్‌కతా: ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీకి సంబంధించిన కేసులో తృణమూల్ కాంగ్రెస్‌కు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు. ఈ కేసు విచారణలో భాగంగా ఖాళీఘాట్‌లోని టీఎంసీ కార్యాల యానికి సీఐడీ బృందం మంగళవారం వెళ్లింది. అయితే సీఐడీ టీమ్‌ను కార్యాలయం ఆవరణలోకి అనుమతించలేదని తెలుస్తోం ది. టీఎంసీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసానికి ఆనుకుని ఈ కార్యాలయం ఉంది. తొలుత ఖాళీఘాట్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని వెంట తీసుకుని సీఐడీ బృందం టీఎంసీ కార్యాలయానికి వెళ్లింది. కార్యాలయం వద్ద వేచిచూస్తుండగా వారిని కలిసేందుకు టీఎంసీ మాజీ ఎంపీ, పార్టీ కోశాధికారి సుభాశిష్ చక్రవర్తి బయటకు వచ్చారు. మమతా బెనర్జీ , టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలు ఇండియా కూటమి సమావేశం లో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్నారని సీఐడీ బృందా నికి చక్రవరి తెలియజేశారు. వారు లేకుండా లోపలకు అనుమతించలేమని చెప్పారు. అయితే విచారణలో భాగంగానే తాము వచ్చామనీ, సంబం ధితులు ఎవరూ ఉండాల్సిన పని లేదని సీఐడీ అధికారుల తెలిపారు. అభిషేక్‌కు ఇచ్చిన నోటీసు ను చూపిస్తూ, సెర్చ్ ఆపరేషన్‌కు సహకరిం చాలని కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. కామాక్ స్ట్రీట్‌లోని అభిషేక్



బెనర్జీ నివాసానికి కూడా ఒక సీఐడీ టీమ్ వెళ్లిందని సమాచారం. నకిలీ సంతకాల కేసులో పోలీస్ ఇన్వెస్టిగేషన్‌ను సహకరిస్తున్న సీఐడీ టీమ్ గత మే 30న తొలిసారి అభిషేక్ ఖాళీఘాట్ నివాసానికి వెళ్లింది. జూన్ 1న విచారణకు హాజరుకావాలని కోరింది. అయితే తనకు 14 రోజులు గడువు ఇవ్వాలని అభిషేక్ కోరారు. ఆయన చేసిన విజ్ఞప్తిని సీఐడీ తోసిపుచ్చింది. వారం రోజుల్లోగా తమ ముందు హాజరుకావాలని తాజా నోటీసు ఇచ్చింది. అయితే సోమవారంతో ఆ గడువు ముగిసినప్పటికీ సీఐడీ విచారణకు అభిషేక్ హాజరుకాలేదు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా శోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ, ప్రతిపక్ష ఉపనాయకులుగా అసిమా పాత్రా, నైనా బంద్యోపాధ్యాయ, చీఫ్ విప్‌గా ఫిర్హాద్ హకీంల నియామకానికి సంబంధించి అసెంబ్లీకి సమర్పించిన పత్రాలపై పలువురు టీఎంసీ ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది.

## సైబర్ స్లేవరీ కేసులో ఇద్దరు అంతర్జాతీయ ముఠా సభ్యుల అరెస్ట్




ఢిల్లీ: మానవ అక్రమ రవాణా, సైబర్ స్లేవరీ నెట్‌వర్క్ పై సీబీఐ కొరడా ఝుళిపించింది. ఆగ్నేయాసియా స్కామ్ కాంపౌండ్లతోలింకులు ఉన్న ఇద్దరుకీలక నింది తులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఇదే కేసు లో గత మేనెలలో 4రాష్ట్రాల్లోని 8ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఒకరిని అరెస్టు చేశారు. తాజాగా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. బాధితులను బ్యాంకాక్ నుంచి మే సోట్ మీదుగా థాయిలాండ్-మయన్మార్ సరిహద్దు దాటించి స్కామ్ కాంపౌండ్లకు చేర్చిన లాజిస్టిక్స్ హ్యాండ్లర్‌ను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. అలాగే థాయి లాండ్-మయన్మార్ సరిహద్దు కాంపౌండ్‌లో ఉంటూ భారత్‌లోని సబ్-ఏజెంట్లనునిర్వహిస్తున్న మరో నింది తుడిని అరెస్టు చేశామన్నారు. విదేశాల్లో భారీ జీతాల తో ఉద్యోగాలంటూ భారతీయులను ఈ అంతర్జాతీయ ముఠాట్రాప్‌చేసినట్లు కేసువిచారణలో భాగంగా సీబీఐ అధికారులు గుర్తించారు.
ఉద్యోగాల కోసం వచ్చిన వారిని మయన్మార్, కంబోడి యా దేశాల్లోని స్కామ్ కాంపౌండ్లకు తరలించారని తెలిపారు. బాధితుల పాస్ పోర్టులు బలవంతంగా తీసుకుని, వారితో సైబర్ నేరాలు చేయించినట్లు వెల్లడించారు. శారీరక, మానసిక వేధింపులకూ గురి చేసినట్లు చెప్పుకొచ్చారు. తమను వదిలి పెట్టాలని వేడుకున్న బాధితుల నుంచి భారీగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో వచ్చే విదేశీ ఉద్యోగ ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సీబీఐ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్పెషల్ మెజారిటీ కోసం ఎన్డీయే ప్రయత్నాలు!

ఢిల్లీ: పార్లమెంటులో కూడా టీఎంసీ ఎంపీలు తిరుగుబాటు బావుటా ఎగర వేయవచ్చన్న వార్తల నడుమ మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్వి భజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. త్వరలో లోక్‌సభలో కూడా ఎన్‌డీఏ మూడింట రెండువంతుల స్పెషల్ మెజారిటీ సాధించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



ఇటీవల అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో ఈ బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. దీంతో, స్పెషల్ మెజారిటీ మార్కు 352గా మారింది. ఇందులో 298 మంది ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా 230 మంది ఎంపీలు వ్యతిరేకించా రు. అనుకూల ఓట్లు మేజిక్ ఫిగర్‌ను (352 ఓట్లు) దాటకపోవడంతో బిల్లు వీగిపోయింది. స్పెషల్ మెజారిటీ సాధించాలంటే ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులలో మూడింట రెండు వంతుల (2/3) మంది బిల్లుకు మద్దతు ఇవ్వాలి. వీరి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో (543) సగానికి పైగా ఉండాలి. ఈ రెండూ కుదిరితేనే స్పెషల్ మెజారిటీగా పరిగణిస్తారు. పార్లమెంటు వేదికగా తృణమూల్‌లో చీలిక తప్పదన్న అంచనాలు వెలువడుతున్న నేప థ్యంలో అధికార ఎన్‌డీఏ కూటమి సంఖ్యాబలం స్పెషల్ మెజారిటీకి మరింత చేరువ అవుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తనకు 20ఎంపీల మద్ద తు ఉందని టీఎంసీ ఎంపీ కాకోలీ ఘోష్ దస్తీదార్ పేర్కొన్నారు. టీఎంసీలో చీలిక తెచ్చేందుకు ఆయన కు మరో ఎంపీ మద్దతు అవసరం. తరువాత వీరంతా లోక్‌సభలో ఒక బృందంగా ఎన్డీయేకు మద్దతు పలికే అవకాశం ఉన్నట్టు జాతీయమీడియా లో కథనాలు వెలువడ్డాయి. ఇదే జరిగితే ఎన్‌డీఏ సంఖ్యాబలం 300మార్కు దాటుతుంది. ఇక డీఎంకే ఎంపీలు కూడా ఎన్‌డీఏకు కొన్ని షరతులకు లోబడి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



## పినరయి విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు

తిరువనంతపురం: సీఎమ్ఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12న కొచ్చిలోని ఆఫీస్ లో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తోపాటు 9 మందికి ఈడీ సమన్లు జారీ చేసింది. పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్సల్టెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెకి 1.72కోట్ల నుంచి 2.78 కోట్ల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రితో ఉన్న కుటుంబ సంబంధాల వల్లే ఈ అక్రమ చెల్లింపులు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలోనే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వీణా విజయన్‌పై కంపె నీల చట్టం కింద కేసు నమోదు చేసింది. అంతేకాదు.. ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టంకింద విచారణ చేపట్టింది. ఈ కేసులో ఈడీ విచార ణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మే 26వ తేదీన విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఇప్పుడు వీణా విజయన్‌కు నోటీసులు ఇచ్చారు.

# హెచ్1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజు రద్దు

## ట్రంప్‌నకు ఫెడరల్ కోర్టు షాక్

## భారత టెక్కీలకు భారీ ఊరట

అమెరికా: అమెరికాలో ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడాలని కలలుగనే లక్షలాది మంది భారతీయ సాఫ్ట్‌వేర్ నిపుణులకు, ఐటీ కంపెనీలకు అమెరికా ఫెడరల్ కోర్టు ఒక అద్భుతమైన శుభవార్త చెప్పింది. విదేశీ ఉద్యోగుల హెచ్1బీ వీసా స్పాన్సర్‌షిప్ కోసం కంపెనీలు అదనంగా 1,00,000 డాలర్లు (దాదాపు రూ.88 లక్షలు) చెల్లించాలంటూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గత ఏడాది సెప్టెంబర్‌లో తెచ్చిన వివాదాస్పద నిబంధనను న్యాయస్థానం పూర్తిగా నిలిపివేసింది. ఈ భారీ రుసుము రాజ్యాంగ విరుద్ధమని, దేశంలో పన్నులు విధించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు (అమెరికా పార్లమెంట్) మాత్రమే ఉంటుందని, అధ్యక్షు డికి కాదని జడ్జి స్పష్టం చేశారు. దీంతో అమెరికా వెళ్లాలనుకునే టెక్కీలపై, వారిని తీసుకెళ్లే కంపెనీలపై పడబోయిన ఒక పెద్ద ఆర్థిక భారం ప్రస్తుతానికి తప్పినట్లయింది. ఈ నిర్ణయం అమెరికన్ ఐటీ రంగానికి ఊపిరి పోసిందనే చెప్పాలి. ఒకవేళ ఈ లక్ష డాలర్ల ఫీజు అమలులోకి వచ్చి ఉంటే, భారతీయ కంపెనీలతో పాటు సిలికాన్ వ్యాలీలోని గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజాలు కూడా భారత్ నుంచి నిపుణులను తీసుకెళ్లడానికి వెనుకడుగు వేసేవి. అమెరికాకు వచ్చే హెచ్1బీ వీసాల్లో దాదాపు 70 నుంచి 72 శాతం వాటా మన భారతీయులదే. అందుకే ఈ తీర్పు మన ఇంజనీర్లు, డెవలపర్లు, పరిశోధకులకు ఒక పెద్ద విజయం.




### అంత తేలిగ్గా తీసుకోదు

కానీ, ఈ సంతోషం ఎంతకాలం నిలుస్తుందనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కోర్టు తీర్పు తాత్కాలికంగా ఉపశమనం కలిగించినప్పటికీ, ట్రంప్ యంత్రాంగం అంత తేలిగ్గా వెనక్కి తగ్గుతుందని భావించలేం. చట్టపరమైన లొసుగులను వాడుకుని వీసా ప్రక్రియను మరింత కఠినతరం చేసేందుకు వైట్ హౌస్ ప్రయత్నించే అవకాశం ఉంది. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా ఈ పరిణామాలపై స్పందిస్తూ, "కోర్టు ఉత్తర్వుల తర్వాత హెచ్1బీ వీసాలతో ముడిపడి ఉన్నవారంతా ఊపిరి పీల్చుకుంటారు. అయితే ఇదే ఈ వ్యవహారానికి ముగింపు అని చెప్పలేం" అని వ్యాఖ్యానించారు. పరిపాలనా విభాగం చట్టా న్ని ఉల్లంఘించకుండానే, కేవలం అంతర్గత నిబంధనలు లేదా కఠినమైన స్క్రీనింగ్ పద్ధతుల ద్వారా వీసాదారులకు కొత్త అడ్డంకు లు సృష్టించవచ్చని ఆయన హెచ్చరించారు.

# కాంగోలో ఎబోలా అలజడి

## 101 చేరిన మృతుల సంఖ్య

కాంగో: డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగోలో ఎబోలా అలజడి సృష్టిస్తోంది. కేసులు, మరణాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ పోతోంది. ఎబోలా కేసుల సంఖ్య 550కి చేరింది. వీరిలో 101 మంది ప్రాణాలు కోల్పోయారు. వైద్యాధికారులు సోమవారం విడుదల చేసిన వివరాల మేరకు.. ఆదివారం రోజున ఇటూరి, నార్త్ కివు ప్రాంతాల్లో కొత్తగా 35 ఎబోలా కేసులు నమో దు అయ్యాయి. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. 7 మంది ఎబోలా నుంచి కోలుకున్నారు. 309 మంది ఐసోలేషన్ లేదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, కాంగోతో పాటు ఉగాండా దేశంలో 'బుండిబుగ్యో' ఎబోలా వైరస్ రకం తీవ్రంగా వ్యాప్తి చెందుతోంది. కాంగో సరిహద్దుల నుంచి వచ్చిన వారి ద్వారా ఉగాండాలో వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఇప్పటి వరకు ఉగాండాలో 19 కేసులు నిర్ధారణ అయ్యాయి.




ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. బుండిబుగ్యో ఎబోలా రకానికి లైసెన్స్ పొందిన వ్యాక్సిన్ అందుబాటులో లేదు. సరైన మందులు లేకపోవటం వల్లే మరణాల సంఖ్య పెరుగుతోంది. ఎబోలా సోకిన వారికి ప్రస్తుతం ఐవీ ఫ్లూయిడ్స్, జ్వరం టాబ్లెట్స్ ద్వారా చికిత్స అందిస్తున్నారు.

### త్వరలో అందుబాటులోకి రష్యా వ్యాక్సిన్

'బుండిబుగ్యో'ను కట్టడి చేసేందుకు కొత్త వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు ఇప్పటికే రష్యా ప్రకటించింది. కాంగోలో వ్యాపిస్తున్న 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పించగలదని రష్యా తెలిపింది. 'బుండిబుగ్యో'ను నిరోధించేందు ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ఈ సమయంలో రష్యా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ ఎంతో కీలకంగా మారనుంది.

# నువ్వు ఒంటరి అయిపోతావ్..

## నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్

అమెరికా: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఇటీవల చెలరేగిన ఉద్రిక్తతలు అమెరికా జోక్యంతో సద్దుమణిగిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై దాడులను కట్టిపెట్టాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు తాను స్పష్టం చేశానని సోమవారం అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. పరిస్థితి మరింత దిగజారకుండా నిరోధించానని మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. 'నేను బీబీని (నెత్యన్యాహు) హెచ్చరించా.. తన చర్యల విషయంలో జాగ్ర త్తగా ఉండాలని అన్నా. మాట వినకపోతే చివరకు ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించా' అని ట్రంప్ మీడియాకు చెప్పారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు హద్దుదాటకుండా అడ్డుకున్నానని కూడా చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తేవాలని తనను ఐదు దేశాలు కోరడంతో ఆయనకు ఫోన్ చేశానని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై దాడుల గురించి ఆదివారం రాత్రి బీబీ తనకు చెప్పారని అన్నారు. అప్పటికే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాన్ వైపు వెళ్లిపోయా యని చెప్పారు. ట్రంప్ ప్రకటనకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని ప్రజలను ఉద్దేశించి టీవీలో ప్రసంగించారు. ఇరాన్ దాడుల నుంచి తనని తాను కాపాడుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని అని స్పష్టం చేశారు. ఇరాన్ మళ్లీ దాడులు చేస్తే ఈసారి పూర్తిశక్తితో ప్రతిస్పందించాల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్ శనివా రం ఇజ్రాయెల్‌పై మిసైల్స్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. బదులుగా ఇజ్రాయెల్ కూడా వైమానిక దాడులు చేసింది. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో అమెరికా జోక్యం చేసుకుని ఘర్షణలు తాత్కాలికంగా సద్దుమణిగేలా చేసింది.



# 37 ఏళ్ల మహిళ 12 ఏళ్ల బాలికలా..

## హాలీవుడ్ సినిమాను తలపించే క్రైమ్ స్టోరీ

బ్రెజిల్: హాలీవుడ్‌లో 'ఆర్ఫన్' అనే సినిమా ఉంటుంది. ఆ సినిమాలో ఓ జంట 9 ఏళ్ల బాలికను దత్తత తీసుకుం టుంది. ఆ బాలిక ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత దారుణమైన సంఘటనలు జరు గుతుంటాయి.హీరోయిన్‌కు బాలిక మీద అనుమానం వస్తుంది. బాలిక గురించి ఎంక్వైరీ చేస్తే షాకింగ్ విషయాలు తెలు స్తాయి. తమ ఇంట్లో ఉన్నది బాలిక కాదని,33ఏళ్ల మహిళ అని తెలుస్తుంది. అచ్చం 'ఆర్ఫన్' సినిమాను తలపించే లాంటి ఘటన బ్రెజిల్‌లో చోటుచేసు కుంది. ఓ నేరస్తురాలు బాలికలా నాట కమాడింది. ఓ కుటుంబం ఆమెను దత్తత తీసుకునేలా చేసింది. అయితే, ఆమె ప్లాన్ కొన్ని రోజుల్లోనే బెడిసి కొట్టింది. పోలీసులకు అడ్డంగా దొరికి పోయింది. శాంటా క్యాతరీనాకు చెందిన అమాండా మారియా సౌజా డీ ఒలివెరా అనే 37 ఏళ్ల మహిళ 'ఆర్ఫన్' సినిమా స్టైల్లో మోసానికి తెరతీసింది. చర్చి సంఘాలు, వాలంటీర్ల ద్వారా కుటుంబా లకు పరిచయం అయ్యేది. తనను తాను 12 ఏళ్ల బాలికగా పరిచయం చేసుకు నేది. వారి ముందు చిన్న పిల్లలా ప్రవ ర్తించేది. 'నీ ఆకారం 12 ఏళ్ల బాలికలా లేదు ఎందుకు?' అని ఎవరైనా ప్రశ్నిస్తే చిన్నప్పుడు ఎదురైన దారుణమైన సంఘటనల కారణంగా చిన్న వయసు లోనే పెద్ద మనిషిలా కనిపిస్తున్నానని చెప్పేది. వారు ఆమె మాటలు నమ్మే వారు. కొద్దిరోజుల క్రితం ఓ కుటుంబం ఒలివెరాను దత్తత తీసుకుంది. ఆ కుటుంబానికి చెందిన ఓవ్యక్తికి ఒలివెరా మీద అనుమానం వచ్చింది. ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా ఒలివెరా ఓ దొంగ అని తేలింది. ఆమెపై బ్రెజిల్ వ్యాప్తంగా చాలా కేసులు ఉన్నాయని వెల్లడైంది. వెంటనే అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఆమెపై ఫ్రాడ్, ఐడెంటిటీ థెఫ్ట్ మీద కేసులు నమోదు అయ్యాయి.





# పీవోకేలో భారీ కాల్పులు

## 30 మందికి పైగా మృతి, 200 మందికి గాయాలు?

కరాచీ: పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీంలో అల్లర్లు చెలరే గాయి. స్థానికులు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ మద్దతుదారులు 30మందికి పైగా మృతిచెందగా.. సుమారు 200మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఆర్థిక, రాజకీయ సమస్యలపై నిరసనలు చేపడుతున్న జేఏఏసీ సంస్థను పాకిస్థాన్ ప్రభుత్వం గతవారం నిషే ధించడంతో భారీ ఉద్రిక్తతలు చెలరేగాయి. ఆదివారం రావల్‌కోట్‌లో నిరసనకారులు, భద్రతా దళాలు మధ్య జరిగిన ఘర్షణల్లోపదులకొద్దీ ఆందోళనకారులు మృత్యు వాత పడినట్లు సమాచారం. జేఏఏసీని ఉగ్రవాద సంస్థ గా ప్రకటిస్తూ నిషేధించడంతో శుక్రవారంరాత్రి ఆందో ళనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో భద్రతా దళాల కాల్పుల్లో ఓ వ్యాపారి మరణిం చారంటూ ఆరోపణలు రావడంతో నిరసనలు తీవ్రరూ పం దాల్చాయి. ఆదివారం వ్యాపారి మృతదేహాన్ని ఉంచిన ఆస్పత్రి మార్చురీ బయట జేఏఏసీ మద్దతు దారులు పెద్ద సంఖ్యలో గుమిగూడారని రావల్‌కోట్ కమిషనర్ సర్దార్ వహీద్‌ఖాన్ తెలిపారు. వారిని చెదర గొట్టేందుకు ప్రయత్నించగా.. కొందరు నిరసనకారులు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయు ధాలతో దాడిచేశారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగగా.. ఆరుగురు నిరసనకారులు మృతిచెందారని కమిషనర్ పేర్కొన్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు కూడా వెల్లడించారు.

# హర్మూజ్ సమీపంలో కూలిన యూఎస్ ఆర్మీ హెలికాప్టర్



ఇరాన్: అమెరికా ఆర్మీకి చెందిన ఒక అపాచీ హెలికాప్టర్ హోర్ముజ్ జలసంధికి సమీపంలో కూలిపోయింది. హెలికాప్టర్ లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఇరాన్ దాడితో అపాచీ కూలిపోయిందా? లేక మరేదైనా సాంకేతిక లోపం తలెత్తిందా? అనేది మాత్రం ఇంకా తెలియ రాలేదు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పరస్పర దాడులకు దిగిన రోజే హెలికాప్టర్ కూలినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెలికాప్టర్ కూలిన విషయాన్ని అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ కూడా ధ్రువీకరించారు. పైలట్లు క్షేమంగానే ఉన్నారని అన్నారు. హర్మూజ్‌లో ఇరాన్ దూకుడును కట్టడి చేసేందుకు అపాచీ హెలికాప్టర్‌లతో పాటు రీపర్ డ్రోన్లు, ఎఫ్/ఏ-18, ఎఫ్-35 ఫైటర్ జెట్స్‌ను యూఎస్ వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకూ 42 రెండు మిలిటరీ విహంగాలను యూఎస్ కోల్పోయినట్టు అంతర్జాతీయ మీడియా లో వార్తలు వెలువడ్డాయి. అయితే అపాచీ హెలికాప్టర్‌ను కోల్పో వడం మాత్రం ఇదే తొలిసారని తెలుస్తోంది. ప్రపంచంలోని అత్యాధునిక మిలిటరీ హెలికాప్టర్‌లలో అపాచీ కూడా ఒకటి. హెల్‌ఫైర్ మిసైల్స్‌తో ఇది శత్రుమూకలను టార్గెట్ చేస్తుంటుంది. యుద్ధ ట్యాంకులను కూడా ఈ మిసైల్స్ ధ్వంసం చేయగలవు. శత్రుదేశ దాడులను తట్టుకునేలా గట్టి కవచం కూడా ఈ హెలి కాప్టర్‌లో ఉంటుంది. హర్మూజ్‌లో డ్రోన్స్, ఇతర చిన్న బోట్లను టార్గెట్ చేసేందుకు యూఎస్ అపాచీ హెలికాప్టర్‌లను వినియో గిస్తోంది.



# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. టాప్ 10లోకి దూసుకొచ్చిన హర్మన్‌ప్రీత్



మరికొద్ది రోజుల్లో మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. దీంట్లో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్ మళ్లీ అంతర్జాతీయ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల ఐర్లాండ్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్ చివరి మ్యాచ్‌కు వెస్టిండీస్ ప్లేయర్ హేలీ మ్యాథ్యూస్ దూరమైన సంగతి తెలిసిందే. దీంతో ఆమె టాప్ ప్లేస్‌ను కోల్పోయింది. అమెలియా కెర్ 478 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, మ్యాథ్యూస్ 473 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. అయితే వీరిద్దరి మధ్య తేడా కేవలం ఐదు పాయింట్లే కావడం గమనార్హం. మరోవైపు స్కాట్లాండ్ ఆల్‌రౌండర్ కేథరిన్ బ్రేస్ ఐర్లాండ్ ట్రై సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో ఏకంగా తొమ్మిది స్థానాలు ఎగబాకి 17వ ర్యాంక్‌కు చేరుకుంది.

**హర్మన్‌ప్రీత్ దూకుడు**

భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టీ20లో అర్ధ శతకం సాధించిన సంగతి తెలిసిం దే. దీంతో బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఆమె టాప్ 10లోకి దూసుకొ చ్చింది. 655 రేటింగ్ పాయింట్లతో 10వ స్థానంలో నిలిచింది. న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ సోఫీ డివైన్ 650 పాయిం ట్లతో 11వ స్థానంలో కొనసాగుతోంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసీస్ ప్లేయ ర్ జార్జియా వాల్ 815 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగు తోంది. ఆసీస్ వికెట్ కీపర్ బెత్ మూనీ (788), సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(786) పాయింట్లతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసా గుతున్నారు. భారత ప్లేయర్లలో స్మృతి మంధాన (740) ఐదో స్థానంలో నిలిచింది.

**బౌలర్ల జాబితాలో లిన్సీ స్మిత్**

బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కూడా పలు మార్పులు చోటు చేసుకు న్నాయి. ఇంగ్లండ్ ప్లేయర్ లిన్సీ స్మిత్ 727 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. మరో ఇంగ్లండ్ ప్లేయర్ లారెన్ బెల్ 723 పాయింట్లతో రెండో స్థానానికి చేరి పాక్ బౌలర్ సాదియా ఇక్బాల్‌తో సమానంగా నిలిచింది. భారత స్పిన్నర్ శ్రీచరణి మాత్రం మూడు స్థానాలు కోల్పోయి ఏడో ర్యాంక్‌కు పడిపోయింది.

# సిరాజ్‌కు విశ్రాంతి..జట్టులోకి స్టార్ పేసర్

భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ను టీ20 జట్టు నుంచి తప్పించింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అతడి స్థానం లో మరో స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను జట్టులోకి ఎంపిక చేసింది. 'వైద్య బృందం, జట్టు యాజమాన్యంతో చర్చించిన అనంతరం సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించాం. రాబోయే సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందుస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇటీవలి ప్రదర్శనల ఆధారం గా ప్రసిద్ధ్ కృష్ణను సిరాజ్ స్థానంలో భర్తీ చేశాం' అని బీసీసీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జూన్ 26 నుంచి భారత జట్టు ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత జూలై 1 నుంచి జూలై 11 వరకు ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల్లో తలపడనుంది. దీనికి సంబంధించి తొలుత ప్రకటించిన జట్టులో సిరాజ్‌కు చోటు దక్కింది. కానీ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ దృష్ట్యా అతడిని తప్పించి ప్రసిద్ధ్ కృష్ణను బీసీసీఐ



తాజాగా ఎంపిక చేసింది.

**ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు భారత జట్టు**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబె, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), నితీశ్‌కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ

# నిరాశపరిచిన వైభవ్ సూర్యవంశీ



శ్రీలంక వేదికగా ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక ఎ, భారత్ ఎ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యువ భారత జట్టు కాస్త తడబడుతోంది. భారీ అంచనా లతో బరిలోకి దిగిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. విదేశీ పిచ్‌పై రాణించలేకపోయాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు ఇన్నింగ్స్‌కు అలవాటు పడిన అభిమానులకు నిరాశే ఎదురైంది. వైభవ్ 12 బంతుల్లో కేవలం 14 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మూడు ఫోర్లతో దూకుడుగా ఆడుతున్నట్లు కనిపించన ప్పటికీ మహ్మద్ షిరాజ్ వేసిన బంతిని భారీ షాట్ కొట్టేందుకు ప్రయత్నించిన వైభవ్.. మిడాఫ్‌లో దొరికిపోయాడు. వైభవ్ కొట్టిన బంతిని సాహన్ అరాచిగే ఎలాంటి పొరపాటు చేయకుండా క్యాచ్ అందుకున్నాడు. మరో విధ్వంసకర ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2) కూడా తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరాడు. 11 బంతులు ఎదుర్కొన్న ప్రభ్‌సిమ్రన్.. కేవలం 2 పరుగులే చేయగలిగాడు. కరుణారత్నే బౌలింగ్‌లో సమరవిక్రమకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో స్వల్ప స్కోర్‌కే భారత్ ఎ జట్టు 2 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ వార్త రాసే సమయానికి 13 ఓవర్లు ఆడిన భారత యువ జట్టు.. 68 పరుగులు చేసింది. క్రీజులో రుతురాజ్ గైక్వాడ్(18), ప్రియాంశ్ ఆర్య(32) ఉన్నారు.

## రుతురాజ్ సెంచరీ..

# శ్రీలంక ఎ టార్గెట్ ఎంతంటే?



ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంకలోని దంబుల్లా వేదికగా భారత్ ఎ, శ్రీలంక ఎ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత యువ జట్టు.. నిర్ణీత 50 ఓవర్ల లో 6 వికెట్లు కోల్పోయి 277 పరుగులు చేసింది. శ్రీలంక ఎకి 278 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్(101) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ తిలక్ వర్మ(60) హాఫ్ సెంచరీ చేశాడు.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఎ జట్టు కు శుభారంభం దక్కలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ(14) తీవ్రంగా నిరాశపర్చాడు. మరో విధ్వం సకర బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2) స్వల్ప స్కోరుకే పెవిలియన్ బాట పట్టాడు. దూకుడుగా ఆడుతున్న ప్రియాంశ్ ఆర్య(32) విచిత్రమైన రీతిలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రుతురాజ్, తిలక్ వర్మ భారీ షాట్లతో అదరగొట్టారు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పా రు. ఆయుశ్ బదోని(24) విఫలమయ్యాడు. సుర్యాంశ్ షెడ్గె(26), అనుకుల్ రాయ్(1) నాటౌట్‌గా నిలిచారు. శ్రీలంక ఎ బౌలర్లలో షిరాజ్ 2, చమీకా కరుణరత్నే 1, గరుకా సంకేత్ 1, వానుజా సహన్ 1 వికెట్ పడగొట్టారు.


# పూర్తి ఫిట్‌నెస్ సాధించిన హార్దిక్ పాండ్య!



అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. జూన్ 13 నుంచి అఫ్గాన్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం భారత్ సిద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత జట్టుకు ఊరటనిచ్చే వార్త అందింది. గాయం బారిన పడిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. అఫ్గానిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు అందుబాటు లోకి వచ్చాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసిన హార్దిక్‌కు.. మెడికల్ టీమ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియ న్స్‌కు కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ వెన్ను నొప్పి కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. జూన్ 2 నుంచి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఐదు రోజుల పాటు పలు శిక్షణా సెషన్లలో పాల్గొన్నట్టు సమాచారం. అతడి పూర్తి కోటా 10 ఓవర్లు బౌలింగ్ చేసినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. శిక్షణ సమయంలో ఎలాంటి అసౌకర్యం కనిపించలేదని, ఫిట్‌నెస్‌కు సంబంధించిన అన్ని ప్రమాణాల్లో హార్దిక్ సంతృప్తికర ఫలితాలు సాధించాడని సమాచారం. ముఖ్యంగా 10 ఓవర్ల పూర్తి స్పెల్ బౌలింగ్ చేయడం అతడు 50 ఓవర్ల క్రికెట్‌కు సిద్ధంగా ఉన్నాడనే సంకేతంగా భావిస్తున్నారు. అయితే హార్దిక్ నేరుగా ధర్మశాలలో జరగనున్న తొలి వన్డేతో జట్టులో చేరతాడా? లేక చండీగఢ్‌లో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటాడా? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే తొడ కండరాల గాయం కారణంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అతడి స్థానంలో యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ ప్రకటించింది. మరో బ్యాటర్ రోహిత్ శర్మ కూడా ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్నాడు. ఐపీఎల్ సమయంలో గాయపడిన రోహిత్ గాయం పరిస్థితిని బీసీసీఐ వైద్య బృందం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

చైతన్య రథం
సినిమా
బుధవారం 10 జూన్ 2026 X

# ...ఓన్లీ న్యూ ఏజ్!




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు జూన్ 10న జరుపుకుంటుండటంతో ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రంనుంచి మేకర్స్ సాలిడ్ ట్రీట్ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. అయితే, వారిచ్చే ఆ ట్రీట్ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. కాగా, ట్రీట్‌కు మేకర్స్ తాజాగా టైమ్ ఫిక్స్ చేశారు. ఎన్‌బీకె111 చిత్రం నుండి 'ఒక కొత్త శకానికి నాంది' అంటూ బాలయ్య ఎంట్రీ ఇచ్చే టైమ్ లాక్ చేశారు మేకర్స్. ఈ ట్రీట్‌ను జూన్ 10న సాయంత్రం 5.40 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రీ-లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'నో మోర్ వింటేజ్.. ఓన్లీ న్యూ ఏజ్' అంటూ ఈ సినిమాకు వారిచ్చిన క్యాప్షన్ ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేస్తుంది. మరి నేడు చిత్రం నుండి రాబోయే ట్రీట్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో వేచి చూడాలి. గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తున్న సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తోంది.

# శ్రీలంక వెళ్తున్న లూగర్..!

కథానాయకుడు ఎన్టీఆర్.. దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతోన్న బహుభాషా చిత్రం 'డ్రాగన్'.మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రుక్మిణీ వసంత్ కథానాయిక. అనిల్ కపూర్, బిజూ మేనన్, ఖుష్బూ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ని శ్రీలంకలో ప్రారంభించుకోనుందని సమాచారం. జులైలో మొదలు కానున్న ఆ సుదీర్ఘ షెడ్యూల్లో భారీ యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది.దీని కోసం ఈ చిత్ర బృందం లంకకు పయనం కావడానికి ముందు హైదరాబాద్‌లో ఓ చిన్న షెడ్యూల్ని పూర్తి చేసే అవకాశమున్నట్లు తెలిసింది. 1967 నేపథ్యంలో ఓపీఎం అక్రమ వ్యాపారం కేంద్రంగా సాగే ఆసక్తికర కథతో ఈ యాక్షన్ థ్రిల్లర్ సిద్ధమవుతోంది. ఎన్టీఆర్ ఇందులో లూగర్ అనే శక్తిమంతమైన పాత్రలో అందర్నీ అలరించనున్నారు. ఆయన ఇందులో రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: భువన్ గౌడ.



# ఆ సీన్లు కట్



'పెద్ది'లో వివాదాస్పద సీన్లు కట్ చేసినట్టు దర్శకుడు బుచ్చిబాబు వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ ఇందులోని కొన్ని సన్నివేశాలపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల క్షమాపణలు చెప్పిన బుచ్చిబాబు.. ఆయా సన్నివేశాలను తొలగిస్తామని చెప్పారు. వాటిని తొలగించినట్టు తాజాగా ప్రకటించారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై వివరణ ఇచ్చారు. "చాలామంది ఇలాంటి మంచి కథలో జాన్వీకపూర్ ట్రాక్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. సినిమాకు ఆ పాత్ర అనవసరమని కామెంట్ చేశారు. నా గత సినిమాతో (ఉప్పెన) పోలిస్తే 'పెద్ది' కథను నేను పూర్తి భిన్నంగా రాసుకున్నా. కొండల ప్రాంతంలో మారుమూల గ్రామంనుంచి వచ్చిన వ్యక్తి పెద్ది. మొదట అతడిలో మొరటుతనాన్ని చూపించి.. సినిమా చివరిలో దాన్ని సరిదిద్దాలని భావించాను. అతడు పెరిగిన వాతావరణం వల్ల అలా ఉన్నాడని.. అతడు మారడానికి అమ్మాయి ప్రేమ కూడా ఓ కారణం కావాలని ఆమె పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలో కొన్ని సన్నివేశాలు అపార్థానికి దారి తీశాయి. దీంతో అందరూ ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకున్నారు. విడుదల అనంతరం వచ్చిన విమర్శలను మేం పరిగణనలోకి తీసుకున్నాం. ఆ సన్నివేశాలను గుర్తించి సినిమా నుంచి తొలగించాం" అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన సినిమాలో పెద్దిగా రామ్‌చరణ్, అచ్చియమ్మ పాత్రలో జాన్వీ కనిపించారు. ఆమె పాత్రను గ్లామరేకే పరిమితం చేశా రంటూనే.. పరిచయ సన్నివేశాల్లోనూ ఆమెను చూపిన విధానంపై విమర్శలు వచ్చాయి.

# సింగ్ గీతం.. 'యు' సర్టిఫికేట్

టాలీవుడ్ వెటరన్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాస రావు తెరకెక్కిస్తున్న లేటెస్ట్ చిత్రం 'సింగ్ గీతం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. 94 ఏళ్ల వయసులో ఈ లెజెండరీ డైరెక్టర్ మరోసారి తనదైన క్రియేటివ్ పద్ధతిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఎలాంటి డైలాగులు లేకుండా, మొత్తం పాటల రూపంలో ఈ సినిమా సాగనుండటంతో ఈ చిత్రం ఎలా ఉండబోతుందా? అనే ఆసక్తి టాలీవుడ్ ప్రేక్షకుల్లో నెలకొంది. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా సెన్సార్ పనులు కూడా ముగిశాయి. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ క్లీన్ 'యు' సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమా రన్‌టైమ్‌ను 2 గంటల 17 నిమిషాలుగా లాక్ చేశారు మేకర్స్. మరోసారి తనదైన ప్రయోగాత్మక చిత్రంగా 'సింగ్ గీతం'ను మన ముందుకు తీసుకొస్తున్నారు ఈ సీనియర్ డైరెక్టర్. ఈ సినిమాలో అయాన్, అహిల్య బమ్రూ, శాలినీ కొండెపూడి, శివ నారాయణ, తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా నాగ్ అశ్విన్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్ 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



# చైతూ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్



అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ 'వృష కర్మ'లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ 'దూత' రెండో సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన 'దూత-2'పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన 'దూత' తొలి సీజన్ ప్రేక్షకులనుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీస్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం.

# డీజే టిల్లు దర్శకుడినుంచి.. అనుమానపక్షి

'డీజే టిల్లు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు విమల్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సరికొత్త చిత్రం 'అనుమానపక్షి'. 'ఎ సైక్ ఖాస్టిక్ కామెడీ' అనేది ఉపశీర్షిక. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న జూలై 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ప్రిన్స్ సిసిల్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, అజయ్, మస్త్ అలీ వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో మెరవనున్నారు. దర్శకుడు విమల్ కృష్ణ తన మార్క్ కామెడీ నరేషన్‌తో కథను ఎంతో క్రేజీగా మలిచినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. టీజర్‌లో హీరో ప్రతి విషయాన్ని భూతద్దంలో చూస్తూ అనుమానం పెంచుకుని దానివలన ఎదురైన పరిణామలు ఏంటి అనేది సినిమా కథ అని తెలుస్తుంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక, స్నేహ రాజేష్ జగ్తియాని, విహాన్ దాండ్, శ్రీచరణ్ మర్నేని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, భరత్ లక్ష్మిపతి కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. డీజే టిల్లులాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ నుండి వస్తున్న సినిమా కావడంతో, జూలై 10న విడుదల కాబోతున్న 'అనుమానపక్షి' బాక్సాఫీస్ వద్ద మరో పెద్ద సక్సెస్ అందుకోవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అనుకుంటున్నాయి.

